ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శనివారం 30 మే 2026
సంపుటి: 28 సంచిక: 61
Saturday 30 May 2026
Vol.No 28 Issue No .61
హైదరాబాద్
Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

- సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం
- ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి
- రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు - మంత్రి తుమ్మల



హైదరాబాద్,మే29 : హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ మిగతా 2లో..

## నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం



- వారిని కఠినంగా శిక్షించి తీరుతాం
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ,మే29 : నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ మిగతా 2లో..

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది



- యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ,మే29 : నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు మిగతా 2లో..

## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

-భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,మే29 : పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే మిగతా 2లో..

# ఎస్ఐఆర్‌పై పూర్తి అవగాహన అవసరం

## కాంగ్రెస్ నాయకులకు సీఎం సూచనలు





హైదరాబాద్,మే29 : ఎస్ఐఆర్ అంశంపై ప్రతి నాయకుడు, కార్యకర్త పూర్తి అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎస్ఐఆర్ వల్ల సామాన్యులు, పేదలు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందో గుర్తించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ముఖ్యంగా లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులు, మహిళలు, దళితులు, మైనార్టీల ఓట్లపై ప్రభావం పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో భారీగా వలసలు జరిగిన నేపథ్యంలో ఓటర్ల జాబితా విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా చూడటం పార్టీ నాయకుల బాధ్యత అని స్పష్టం చేశారు. గతంలో బూత్ ఎన్‌రోలర్ల సహకారంతో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్‌షిప్ నమోదు చేశామని గుర్తుచేశారు. ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేసిన వారిని రాహుల్ గాంధీ చేతుల మీదుగా సన్మానించామని తెలిపారు. అదే తరహాలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో కూడా గతంలో కీలక పాత్ర పోషించిన ఎన్‌రోలర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. డిజిటల్ మెంబర్‌షిప్ కార్యక్రమం కోసం ప్రతి నియోజకవర్గానికి ఇంఛార్జ్‌లను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. ఇప్పుడు ఎస్ఐఆర్ కోసం 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ప్రత్యేక ఇంఛార్జ్‌లను నియమించాలని ఆదేశించారు. అసెంబ్లీ ఇంఛార్జ్‌లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. ఇంఛార్జ్ మిగతా 2లో..

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

- వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు



మిగతా 2లో..

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

- కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం



హైదరాబాద్,మే29 : రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని మిగతా 2లో..

## తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

- అయినా చివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి



హైదరాబాద్,మే29 : దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ మిగతా 2లో..

## కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

- 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం
- ప్రధాని మోడీ, మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు



హైదరాబాద్,మే29 : కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 మిగతా 2లో..




## చర్లపల్లి జైలుకు బండి భగీరథ్ తరలింపు

హైదరాబాద్,మే29 : పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. 3 రోజుల పోలీస్ కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజిగిరి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం కోర్టు మిగతా 2లో..

# ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సౌలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు
- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్
- సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి,మే29 :రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని వివరించారు. ఈ మేరకు మిగతా 2లో..

## మహిళల భద్రతే లక్ష్యం షీ టీమ్స్ సంస్కార్ మెగా కౌన్సెలింగ్

యువతలో ప్రవర్తనా మార్పు కోసం ప్రత్యేక చర్యలు సీపీ సుమతి



విజన్ ఆంధ్ర(29) మల్కాజ్‌గిరి : మహిళలు, పిల్లల భద్రతకు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ మిగతా 2లో..

## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

- కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక
- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



అమరావతి,మే29 : 'స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదికతో 'స్వచ్ఛ మిగతా 2లో..

# రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

- స్త్రీ శక్తి థీమ్‌కు అర్థం చెప్పేలా 33 శాతం రిజర్వేషన్లు
- విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు
- మహానాడు విజయవంతంపై మీడియాతో మంత్రి లోకేశ్



అమరావతి,మే29 : తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. స్త్రీ శక్తి థీమ్‌కు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి ఆమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మైటీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ మిగతా 2లో..

## 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం

- టిడిపి సంస్కరణలకు ఎప్పుడూ ముందుంటుంది
- హోంమంత్రి వంగలపూడి అనిత



అమరావతి,మే29 : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా అని మిగతా 2లో..

## 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం

మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆత్మగౌరవం.. చంద్రబాబు హయాంలో వారి ఆర్థిక గౌరవం పెరిగాయి. కోటి మంది మహిళలతో డ్వాక్రా సంఘాలు విరాజిల్లుతున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశం 33 ఏళ్లుగా నానుతోంది. మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లుగా స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని అనిత అన్నారు. పార్లమెంటు చట్టంతో సంబంధం లేకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది తమ పార్టీ నిర్ణయమని స్పష్టం చేశారు. లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనపై పార్టీలో మరింత చర్చ చేసి 2029 ఎన్నికలనాటికి తప్పకుండా అమల్లోకి తెస్తామన్నారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని తెలిపారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లపై ఇతర పార్టీల నిర్ణయాలపై తాము మాట్లాడమని తెలిపారు.

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

## కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

## చర్లపల్లి జైలుకు బండి భగీరథ్ తరలింపు

ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

## నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్ఈకి సహకరిస్తోందని తెలిపారు. 11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. ప్రక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

గోదావరి' ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

## ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశిరచుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే..

# ఎస్ఐఆర్‌పై పూర్తి అవగాహన అవసరం



మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పూర్తిగా పార్టీ కార్యక్రమాలకే కేటాయించాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని, తాను కూడా ప్రతి పది రోజులకు ఒకసారి కార్యకర్తలతో సమావేశమవుతానని చెప్పారు. నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసమే సమయం కేటాయిస్తానన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు సహా ప్రతి నాయకుడు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని స్పష్టం చేశారు. తనతో పాటు ఎవరికీ మినహాయింపు ఉండదన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించిన సీఎం.. ఇప్పటికే దాదాపు అన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ప్రస్తుతం పార్టీ తరఫున వేలాది మంది సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఉన్నారని చెప్పారు. హైదరాబాద్ నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్‌పై అసెంబ్లీ వారీగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. మహిళా కాంగ్రెస్ తరఫున క్లస్టర్ల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకులంతా సమన్వయంతో ముందుకు వెళ్లాలని, నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని సీఎం పేర్కొన్నారు.

### తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్,మే29 : తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల పక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

### రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ÷ాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ÷-రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ÷ాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## రెండ్రోజల మహానాడు దిగ్విజయం

అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఓజిఆఖ, ఎ÷ుఆఖ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభి వందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేశ్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని ఆయన వివరించారు. ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీం కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడును ఒక అవకాశంగా తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడూ ప్రతి పల్లె, ప్రతి ఇల్లూ మహానాడుకు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడిందన్నారు. కార్యకర్తలే అధినేతలై.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివినీ ఎరుగనీ రీతిలో విజయవంతం చేశారని చెప్పారు.

### తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ పక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

### మహిళల భద్రతే లక్ష్యం షీ టీమ్స్ సంస్కార్ మెగా కౌన్సెలింగ్

అత్యంత ప్రాధాన్యత నిస్తోందని, వారిపై వేధింపులు, గృహహింస, బాలలపై నేరాలను ఏమాత్రం సహించబోమని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ స్పష్టం చేశారు, మహిళలు. పిల్లలపై నేరాలకు పాల్పడి షీ టీమ్స్‌కు చిక్కిన నిందితుల్లో ప్రవర్తనా మార్పు తీసుకురావడమే లక్ష్యంగా, మనోజాగృతి సంస్థ సహకారంతో సంస్కార్ మెగా కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ షీ టీమ్స్ ప్రధాన ఉద్దేశ్యం కేవలం చట్ట అమలు మాత్రమే కాదని, తప్పు చేసిన వారు తమ పొరపాట్లను గుర్తించి బాధ్యతా యుతమైన పౌరులుగా మారేలా మార్గ నిర్దేశం చేయడమని తెలిపారు, పోలీస్ రికార్డుల్లో పేరు నమోదైతే భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించిన సీపీ తొలిసారి తప్పు చేసిన యువత కౌన్సెలింగ్ ద్వారా తమ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు, షీ టీమ్స్ గణాంకాల వెల్లడి ఈ ఏడాది జనవరి 1 నుండి మే 18 వరకు మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్ల పరిధిలో షీ టీమ్స్ 61 ఎఫ్ఐఆర్‌లు, 236 పెట్టీ కేసులు నమోదు చేసినట్లు సీపీ వెల్లడించారు, మొత్తం 760మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు, పట్టుబడిన వారిలో 137 మంది మైనర్లు, 24 ఏళ్ల లోపు 384 మంది యువకులు, 50 ఏళ్లు పైబడిన 11 మంది ఉన్నట్లు పేర్కొన్నారు, యువతలో ఇటువంటి ధోరణులు పెరుగుతుండటం ఆందోళన కరమని వారికి మానసిక కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు అత్య వసరమని తెలిపారు, 53 వేల మందికి అవగాహన, మహిళల భద్రత, సైబర్ సేఫ్టీ, పోక్సో చట్టం, సోషల్ మీడియా సురక్షిత వినియోగంపై షీ టీమ్స్ విస్తృతంగా అవగాహన సదస్సులు, మహిళల భద్రత, సైబర్ సేఫ్టీ, పోక్సో చట్టం, సామాజిక బాధ్యత మరియు సోషల్ మీడియాను సురక్షితంగా ఉపయోగించడం పై షీ టీమ్స్ నిరంతరం శ్రమిస్తున్నాయని సీపీ తెలిపారు, ఇందులో భాగంగా ఇప్పటివరకు 406 విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి, 53,000 మందికి పైగా పౌరులను, చైతన్య పరిచినట్లు వివరించారు.

**మానసిక మార్పు చట్టాలపై అవగాహన:**

ఈమెగా కౌన్సెలింగ్ ప్రముఖ సైకాలజిస్ట్, మనోజాగృతి సంస్థ అధినేత్రి శ్రీమతి గీతా చల్లా, మరియు ఆమె బృందం నిందితులకు ప్రవర్తనా పరివర్తన, ఎమోషనల్ అవేర్‌నెస్, ఆత్మ నియంత్రణపై ప్రత్యేక సెషన్లు నిర్వ హించారు, లీగల్ అడ్వైజర్ కృష్ణమోహన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ తదితర న్యాయ నిపుణులు భారతీయ న్యాయ సంహిత పోక్సో చట్టం, ఐటీ యాక్ట్ పరిధిలోని కఠినమైన శిక్షలు, చట్టపరమైన పరిణామాలను నిందితులకు వివరించారు, ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ డీసీపీ డాక్టర్ బి. అనురాధ, మహిళా భద్రత డీసీపీ శ్రీమతి టి. ఉషా రాణి, అడిషనల్ డీసీపీ బి. కోటేశ్వర్ రావు, షీ టీమ్స్ ఏసీపీ పి.వెంకటేశ్వర్లు, పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది మరియు నిందితులు వారి తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇది రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్– బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ–షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజీవ్రాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ది పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది.ఐ

రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్ఎస్ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 –52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# మార్కెట్ కు లారీలు పంపిస్తా - ఆందోళన చెందకండి

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



బోథ్, మే 29, (విజన్ ఆంధ్ర): మార్కెట్ యార్డ్ కు అమ్మకానికి తెచ్చిన జొన్నలను తరలించడానికి కావాల్సిన లారీలను పంపిస్తానని రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన బోథ్ మార్కెట్ యార్డ్ ను ఆకస్మికంగా సందర్శించారు. మార్కెట్ యార్డ్ కు అమ్మకానికి తెచ్చిన జొన్న రైతులు పడుతున్న ఇబ్బందులను నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు. లారీల కొరత కారణంగా జొన్నల కొనుగోలు ఆలస్యం అవుతుందని, అకాల వర్షాలు కూడా తమను ఆందోళనకు గురి చేస్తున్నాయని రైతులు తెలుపగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే లారీలను పంపిస్తానని ఓపికతో ధైర్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఎకరానికి కేవలం 10 క్వింటాళ్ల వరకే కొనుగోలు చేసి రైతులను ఓవైపు ఇబ్బంది పెడుతూ మరోవైపు కొనుగోలు చేసిన పంటలను రవాణా చేయకుండా కేవలం కాట చేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. వర్ష కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఇంకా ఆలస్యం చేయకుండా, ఎలాంటి షరతులు విధించకుండా జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు పూర్తిగా మద్దతుగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఓరుగంటి స్వామి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సర్పంచులు రాజేందర్, రవీందర్, బాబులాల్, నాయకులు ఎలుక రాజు, నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, విడిసి పోతన్న, రమణ గౌడ్, వార్డు మేంబర్ ప్రవీణ్, గంగమల్లు, రమణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- కలెక్టర్ సుడిగాలి తనిఖీలు!!**
**- రైతుల ధాన్యంపై కట్టింగ్ పెడితే చర్యలు తప్పవు**
**- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వసతులు మెరుగు పరచండి**
**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, మే 29 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గౌతమి నగర్‌లోని రైస్ మిల్లులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. రక్ష పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, సమయం ముగిసిందనే కారణంతో ఒక్క రోగిని కూడా వెనక్కి పంపొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే అందించాలని అధికారులను సూచించారు. ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గైనకాలజీ ఓపీ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

అనంతరం శారదనగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఇంటర్మీడియట్ ఫలితాలు, అడ్మిషన్లు, స్టడీ రూమ్ సౌకర్యాలు తదితర అంశాలపై అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మరింత మెరుగైన వసతులు కల్పించే దిశగా అవసరమైన పరికరాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తర్వాత గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను పరిశీలించిన కలెక్టర్ రైతుల ధాన్యంపై ఎలాంటి కట్టింగ్ విధించరాదని మిల్లర్లకు ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. లారీలను సమయానికి దించుకొని రైతులు ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సుడిగాలి పర్యటనలో డాక్టర్లు అరుణ, కృపాభాయి, రాజు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత!!

**- జల సంరక్షణే లక్ష్యం**
**- భూగర్భ జలాల పెంపునకు ప్రజలందరూ సహకరించాలి**
**- రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, మే 29 (విజన్ ఆంధ్ర) : 38వ డివిజన్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ, డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము ఆధ్వర్యంలో శుక్రవారం ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా, ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని వారు సూచించారు. వర్షాకాలంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల ఆవశ్యకతను తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి, భూగర్భ జల మట్టాలను పెంచవచ్చని, తద్వారా భవిష్యత్తులో నీటి కొరతను నివారించవచ్చని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమం ప్రజలలో నీటి సంరక్షణపై అవగాహన కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ఇంకుడు గుంతల నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ చర్యలు స్థానిక పర్యావరణ పరిరక్షణకు, నీటి వనరుల సుస్థిరతకు దోహదపడతాయని అధికారులు వివరించారు. ఈ పర్యటన ద్వారా ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంలో అధికారులు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నవీన్, వార్డ్ ఆఫీసర్ సాయి కృష్ణ, మాజీ కార్పొరేటర్ బొమ్మక రాజేష్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంజాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పెద్దపీట వేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

## వడ్డీ లేని రుణం చెక్కును మహిళా సంఘాలకు అందజేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల మే 29(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మెప్మా & ఐకేపి అర్బన్ గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల లోన్ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఎమ్మెల్యే కి, మున్సిపల్ చైర్ పర్సన్ కి మెప్మా ఆర్పీలు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా మెప్మా మహిళా సంఘాల ఆర్పీలకు, మహిళా సంఘాల సభ్యురాలకు నాలుగు కోట్ల 37 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యతస్తుదని అన్నారు.మహిళా పొదుపు సంఘంలో ప్రతి ఒక్కరు సభ్యులుగా ఉండాలని, సభ్యులుగా లేనివారు కూడా త్వరలో సభ్యులుగా ఏర్పడి మహిళా సంఘం లో చేరి మహిళా సంఘాలు ద్వారా కుటీర వ్యాపారస్తు మహిళలు అభివృద్ధి చెందాలని అన్నారు.సీఎం చెప్పినట్లు మహిళలను కోటీశ్వరులను చేసే విధంగా మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళలు కోటీశ్వరులుగా కావడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం పెద్దపీట వేస్తూ మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించాలని సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయడం జరుగుతుంది.మహిళా సంఘాలలో సభ్యులు ప్రభుత్వ నుంచి వచ్చిన బ్యాంకు ద్వారా వచ్చిన రుణాలను చిన్నచిన్న వ్యాపారాలను చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. పట్టణంలోని కొన్ని మహిళా సంఘాల సభ్యులు మహిళా సంఘాల ద్వారా వచ్చిన డబ్బులను తీసుకొని వడ్డీ వ్యాపారం వంటివి చేయరాదని సూచించారు.మహిళా సంఘాలకు మహిళలకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్స్ బాబర్, ముత్యాల లక్ష్మి, వేదవతి వెంకటేశ్వర రెడ్డి, నాగులు యాదవ్, రామలింగేశ్వర కాంమ్లే, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు వంట భాస్కర్, రిజ్వాన్, సుదర్శన్, కో ఆప్షన్ నెంబర్, మున్సిపల్ కమిషనర్, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతపై జిఈఎమ్ బాలికల నాటిక!!

**- రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత చైతన్యం**
**- ఎన్‌టీపీసీ స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం**
**- ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం**
**- స్వచ్ఛతే సామాజిక బాధ్యత**
**- ఈడీ చందన్ కుమార్ సమంత**





పెద్దపల్లి బ్యూరో చీఫ్, మే 29 ( విజన్ ఆంధ్ర) : స్వచ్ఛ భారత్ సంకల్పాన్ని ప్రజల్లో మరింత బలోపేతం చేసే దిశగా ఎన్‌టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే సహకారంతో రామగుండం రైల్వే స్టేషన్‌లో గురువారం నుక్కడ్ నాటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ బాలికలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్‌టీపీసీ రామగుండం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నుక్కడ్ నాటక్ ద్వారా జెమ్ బాలికలు ప్రజా ప్రదేశాలలో పరిశుభ్రత పాటించాల్సిన అవసరం, ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి అంశాలపై హృద్యంగా సందేశాలు అందించారు. వారి ప్రదర్శనలు ప్రయాణికులను ఆలోచింపజేసి స్వచ్ఛత పట్ల చైతన్యం కలిగించాయి. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వారు అభిప్రాయపడ్డారు. సామాజిక బాధ్యతను చాటుతూ యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్‌టీపీసీ చేపడుతున్న గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ కార్యక్రమం ప్రశంసనీయమని పలువురు అభినందించారు. హ్యూమన్ రిసోర్సెస్ విభాగాధిపతి సాగర్ రంజన్ సాహూతో పాటు హెచ్ఆర్ బృందం, ఎంసీఆర్, ఎఫ్ఎం విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా, మే 29,(విజన్ ఆంధ్ర); జిల్లాలో ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ (రూ–రా) రైస్ మిల్లుతో పాటు కడెం మండలంలోని లక్ష్మీ అన్నపూర్ణ రైస్ మిల్లు, నవాబ్‌పేట్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్లోడ్ చేసిన ధాన్యం వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం, రోజువారీ సగటు అన్లోడింగ్ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులను, మిల్లు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిల్లుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అవసరమైన మేరకు ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. స్థానిక అధికారులు రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు. మిల్లుల తనిఖీ అనంతరం కడెం మండల తహసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన ప్రక్రియను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలు, సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహశీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ, అరుణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల మే 29 (విజన్ ఆంధ్ర) : ఓటరు జాబితాను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై శుక్రవారం హైదరాబాదు నుంచి అదనపు ముఖ్య ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిచేసి అక్టోబర్ 1న ఫైనల్ ఎలక్ట్రోరల్ ఓటర్లు జాబితాను ముద్రించి, ప్రకటించాల్సి ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫామ్ లను ఓటర్లకు ఇచ్చిన తర్వాత ప్రతి ఇంటినీ సంబంధిత బిఎల్ఓలు మూడుసార్లు సందర్శించి, వారిచ్చే డిక్లరేషన్ కూడా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ సరిగ్గా పనిచేయని బిఎల్వోల స్థానంలో కొత్త వారి నియామకం చేపట్టాలన్నారు. సంబంధిత మండలాల తహసీల్దారులు తమ పరిధిలోని సూపర్వైజర్లు, బిఎల్ఓ లతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు జోగులాంబ గద్వాల జిల్లాలో 78.52 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, గద్వాల మండలం లో చాలా తక్కువ మ్యాపింగ్ జరిగినందున వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ మండలాల తహసిల్దారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక మహిళ సంఘాలకు చెక్కును అందజేసిన ఎమ్మెల్యే విజయుడు




అలంపూర్ మే 29 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అలంపూర్ పురపాలక సంఘం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక మహిళా సంఘాల లోన్ మేళా కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణ స్థాయి సమైక్య (టిఐఎఫ్), ప్రాంతీయ స్థాయి సమైక్య (ఏఎల్ ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. అలంపూర్ పట్టణ స్వయం సహాయక సంఘాలకు (14 సంఘాలు ) బ్యాంకు లింకేజీ ద్వారా రెండు కోట్ల రూపాయల ( 2,00,00,000 )చెక్కును మండల మహిళా సమైక్య సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, మండల మహిళ సమైక్య సభ్యులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్ లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్**



గద్వాల మే 29 (విజన్ ఆంధ్ర) : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు. శుక్రవారం ధరూరు మండలం భీంపురం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు కప్పి ఉంచాలన్నారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు తేమ శాతంను పరిశీలించి ఎప్పటికప్పుడు తూకం చేసి మిల్లులకు తరలించాలని సంబంధిత కేంద్రం ఇన్చార్జీలకు సూచించారు. లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా ధాన్యం కొనుగోలు చేసిన రోజే ఓపిఎంఎస్ ను ఆన్లైన్లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని సంచులు కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ధరూరు తహసిల్దార్ నందిని, కేంద్రం సిబ్బంది, తదితరులున్నారు.

## వైఎస్ఆర్ కడప జిల్లాకు చేరుకున్న రాష్ట్ర సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్..



కడప, మే 29 (విజన్ ఆంధ్ర) : రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా. శుక్రవారం ఉదయం వైఎస్ఆర్ కడప జిల్లాకు చేరుకున్న రాష్ట్ర సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్. కడప ఆర్ & బి గెస్ట్ హౌస్ నందు బసచేసిన రాష్ట్ర సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఏడి బి. పద్మజ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామ సుబ్బారెడ్డి, ఏఈఐ ఈ శ్రీనివాసరావు, ఏవిఎస్ నాగయ్య, పలువురు జిల్లా పాత్రికేయులు. ఈ నెల 30,31 తేదీల్లో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడప జిల్లా గ్రామీణ విలేఖరులకు నిర్వహించే పునశ్చరణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరవ్వనున్నట్లు చైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్. తెలిపారు.


## జిల్లాలో 600857.50 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు

**- టీజీ మార్క్‌ఫెడ్ మేనేజర్ చంద్రమౌళి**

గద్వాల మే 29( విజన్ ఆంధ్ర) : 2025–26 యాసంగి సీజన్‌కు గాను జిల్లాలో ఏర్పాటు చేసిన 8 కొనుగోలు కేంద్రాల ద్వారా 600857.50 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు టీజీ మార్క్‌ఫెడ్ మేనేజర్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న యాసంగి కొనుగోలు కోసం జిల్లా వ్యాప్తంగా 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ మొదటి వారం నుండి దాదాపు రెండు నెలల పాటు రైతులకు క్వింటాల్‌కు రూ. 2400/– గిట్టుబాటు ధర కల్పిస్తూ జిల్లా అధికారుల సహకారంతో కొనుగోలు ప్రక్రియను కొనసాగించామని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి కొనుగోలు ప్రక్రియను నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వచ్చినందున, మరి రెండు రోజుల్లో అన్ని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన మొత్తం మొక్కజొన్నలో 90 శాతం బ్యాగులను సమీప గోడౌన్లకు తరలించినట్లు తెలిపారు. మిగతా ప్రాంతాల్లో ఉన్న బ్యాగులను కూడా త్వరితగతిన గోడౌన్లలకు తరలించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## వెయ్యి రోజుల ప్రణాళికతో శిశు ఆరోగ్యం.

**- సీడీపీఓ కే శిరీష**



ములుగు మే 29, విజన్ ఆంధ్ర ప్రతినిధి : శుక్రవారం గొల్లవాడ అంగన్‌వాడీలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా స్థానిక కౌన్సిలర్ గోనెల భరత్, సిడిపిఓ శిరీష పాల్గొని మాట్లాడుతూ గర్భం దాల్చిన రోజు నుంచి రెండేళ్ల వరకు ఉన్న వెయ్యి రోజులే శిశు ఎదుగుదలకు కీలకమని తెలిపారు. గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించి బీసీజీ టీకా వేయించాలని సీడీపీఓ సూచించారు. 6 నెలల వరకు తల్లిపాలు, ఆ తర్వాత దశలవారీగా అనుబంధ ఆహారం ఇవ్వాలని, శిశు ఎదుగుదల మైలురాళ్లను గమనించాలని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, లక్ష్మికాంతమ్మ, సుభద్ర, సుగుణ, లత, మాధవి, వీరలక్ష్మి, శ్యామల, హబ్ సిబ్బంది శిరీష పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంలో జాప్యం తగదు

## రాజకీయ పార్టీలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు




నిజామాబాద్, మే 29 :( విజన్ ఆంధ్ర ) బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం విషయంలో రాజకీయ పార్టీలు జాప్యం చేయకుండా, బీ.ఎల్.ఏ ల నియామకం జాబితాను నిర్ణీత ఫార్మాట్ లో సత్వరమే అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలులో బీ.ఎల్.ఏ ల పాత్ర ఎంతో క్రియాశీలకం అయినందున వారి నియామకంలో తాత్సారం తగదని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలతో కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అమలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. పారదర్శతతో కూడిన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్.ఐ.ఆర్ ను అమలు చేస్తోందని, ఈ మేరకు నిర్ణీత షెడ్యూల్ ను కూడా వేలువరించిందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘంచే గుర్తింపు కలిగిన అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని, నిర్ణీత ఫార్మాట్ లో వారి వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. బీ.ఎల్.ఏల నియామకం కోసం ఇప్పటికే రాజకీయ పార్టీలను లిఖిత పూర్వకంగా కోరినప్పటికీ, ఇంకనూ వివరాలు అందించలేదని అన్నారు. కేవలం ఒక పార్టీ మాత్రమే రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బీ.ఎల్.ఏ ల వివరాలు సమర్పించిందని తెలిపారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలుకు సంబంధించి బీ.ఎల్.ఏ లకు శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉందని, అంతేకాకుండా ముసాయిదా ఓటరు జాబితాలోని అంశాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, బీ.ఎల్.ఏలు వాటిని ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. బీ.ఎల్.ఏల తక్షణ నియామకం ఆవశ్యకతను గుర్తిస్తూ, ఆయా పార్టీలు వెంటనే నియామక జాబితాను అందించాలని అన్నారు. కాగా, ఈ.ఆర్.ఓల స్థాయిలో ప్రతీ వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు గురించి వారికి వివరాలు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీ.ఎల్.ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. బీ.ఎల్.ఓ లకు సహకారం అందించేందుకు వీలుగా వాలంటీర్లను సమకూర్చాలని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల పేర్లు కలిగిన ఓటర్లను మ్యాపింగ్ సందర్భంగా ఖచ్చితంగా గుర్తించేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపాలి అనే దానిపై బీ.ఎల్.ఓలకు సమగ్రంగా అర్థమయ్యే రీతిలో శిక్షణ అందించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీ ఓటర్లు ఉంటే, వారి మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అన్నది ఈ.ఆర్.ఓలు స్వయంగా పరిశీలన జరపాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు, ప్రగతి గురించి రోజువారీగా ఆన్లైన్ లో వివరాలు పొందుపర్చాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ లో పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్.డీ.ఓ రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్.డీ.ఓ రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్డీఓ విజయ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏ.ఈ.ఆర్.ఓలు పాల్గొన్నారు.


# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**- బీ.ఎల్.ఓ లు ఇంటింటిని సందర్శిస్తూ సమగ్ర పరిశీలన జరపాలి**

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**- కలెక్టర్లు, ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలతో వీడియో కాన్ఫరెన్స్**






నిజామాబాద్, మే 29 :విజన్ ఆంధ్ర )స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరుపై శిక్షణ, ఓటరు మ్యాపింగ్ పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 పర్యాయాలు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సీ.ఈ.ఓ తెలిపారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్/ డూప్లికేట్ ఎంట్రీల తొలగింపు జరుగుతుందని అన్నారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడుతుందని స్పష్టం చేశారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, అదే సమయంలో అనర్హులకు అవకాశం లేకుండా నిశిత పరిశీలన జరపాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీ.ఎల్.వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. బీ.ఎల్.ఓలకు ఎస్.ఐ.ఆర్ అమలు విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ గురించి, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన ఏర్పడేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం మ్యాపింగ్‌లో లోపాలు ఉంటే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 1, 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరిదైనా ఒకరి ధ్రువపత్రం సమర్పించాలని, డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రులు ఇద్దరి ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ ఉంటుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించడం జరుగుతుందని సీ.ఈ.ఓ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్.డీ.ఓ రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్.డీ.ఓ రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్డీఓ విజయ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏ.ఈ.ఆర్.ఓలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్‌కు సర్వం సిద్ధం చేయండి

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 29 (విజన్ ఆంధ్ర) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ ఐ ఆర్ )లో భాగంగా జూన్ 25వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఎన్యూమరేషన్ ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి.సుధర్శన్ రెడ్డి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమంపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల అధికారులకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ షెడ్యూల్, నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, స్పష్టమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. ఎస్ ఐ ఆర్ ద్వారా అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపట్టడం తో పాటు, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. విసి అనంతరం జిల్లా కలెక్టర్ సూపర్‌వైజర్లతో మాట్లాడుతూ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 25వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఎన్యూమరేషన్ ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సూపర్‌వైజర్ తమ పరిధిలోని పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సి సెక్షన్ సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక మహోత్సవంలో అలరించిన మహిళా కళాకారుల ప్రదర్శనలు



హైదరాబాద్ మే 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్ ) : రవీంద్రభారతి "పాల్కురికి సోమన్న మూల" వేదికపై కొనసాగుతున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహో త్సవంలో భాగంగా మహిళా కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి, ఆకట్టుకు న్నాయి. గురు వారం 58 వ రోజు నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ గాయనీమణులుపద్మావతి, స్వర్ణ, మల్లిక, శారద, నిర్మల పాడిన "మీత్యాగాలా తెలంగాణ జెండాలెత్తుకున్నమో విద్యార్థీ వీరుల్లారా, ఎక్కడమ్మా నీవులెరనిదీ, ఆడుదాం డప్పుల్లా దరువువెయ్ రా, చిత్తూ చిత్తూల గుమ్మ శివునీ ముద్దుల గుమ్మ" మొదలగు పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు, బీసీ కమీషన్ మెంబర్ బాలలక్ష్మి, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. ఏనుగు నర్సింహ్మారెడ్డి కళాకారులను సత్కరించినారు. ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ డైరెక్టర్ నర్సింలు, డా.విజయ్ కుమార్,ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాని ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మాపల్లె శంకర్, బందంరాజు, సునీత, విద్యానందాచారి, సోని అమూల్య, జ్యోత్స్న, శ్రీనివాస్ రాజు, వంతడుపుల గణేష్, బోనాల నరేష్, ప్రభాత భేరి పాటలు, సామాజిక చైతన్య గీతాలు పాడారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా విద్యానందాచారి, సోని వ్యవహరించారు.

## పంచవటి కాలనీలో మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ పర్యటన



అల్వాల్, మే 29,(విజన్ ఆంధ్ర): మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని పంచవటి కాలనీలో గురువారం మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ పాదయాత్ర నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో దెబ్బతిన్న సీసీ రోడ్లు, ఓపెన్ నాలా సమస్య లను ఆయన పరిశీలించారు. వెంటనే,సమస్యలను పరిష్క రించాలని సంబంధిత అధికారులు డిఈ మహేష్, విఘ్నేష్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లకు సూచించారు. కాలనీలో ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేయాలని, పచ్చదనం పరిరక్షణ చేయాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని జితేందర్ నాథ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఆర్‌డబ్ల్యూఏ సభ్యులు లక్ష్మీనారాయణ, రాజీవ్, దర్శన్, మహిపాల్, రాము, యస్వంత్, శ్రీను,కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, సర్వేష్ యాదవ్, వెంకటేష్, దేవా, జితేందర్, కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



పాపన్నపేట, 29 మే, విజన్ ఆంధ్ర; పాపన్నపేట మండలంలోని అర్హులైన 104 మంది లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద మొత్తం రూ.1,04,12,064 విలువైన చెక్కులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వర్షాలకు ధాన్యం తడిసినా కొనుగోలు చేస్తాం

**- రైతులు అధైర్యపడొద్దు..**

**- తాలు, తరుగు పేరుతో ఇబ్బంది పెడితే కఠిన చర్యలు**

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 29 (విజన్ ఆంధ్ర): వర్షాల వల్ల ధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి తరలించడం జరుగుతుంది తాలు, తరుగు పేరుతో రైతుల్ని ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవు: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్షాల వల్ల ధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి తరలించడం జరుగుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి వీపనగండ్ల మండల కేంద్రం, కేతేపల్లి శివారులో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పెద్ద మొత్తంలో వరి ధాన్యం బస్తాలు తడిసిన నేపథ్యంలో వాటిని ఆయన నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రధానంగా లారీల కొరత సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ఇసుక, ఫ్యాక్టరీలకోసం వినియోగించు లారీలన్నింటిని పట్టుకుని ధాన్యం తరలించడానికే తీసుకురావాలని ఆదేశించారు. ముందుగా వీపనగండ్ల, పానగల్ పరిధిలోని కొనుగోలు కేంద్రాలకు లారీలను అత్యవసరంగా తరలించాలని సూచించారు. తడిచిన ధాన్యాన్ని వెంటనే బాయిల్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వర్షాల వల్ల ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని సైతం గోదాములకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేతేపల్లి శివారులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రి కొనుగోలు ప్రక్రియ ఆలస్యం చేయడంపై నిర్వాహకులపై మండిపడ్డారు. కొనుగోళ్లను వేగంగా చేపట్టి వెనువెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తే ఎవరిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో మిల్లర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవు అన్నారు. అనంతరం మెహ్రూన్ ఇండస్ట్రీస్ ను సందర్శించిన మంత్రి ధాన్యం అన్లోడింగ్ పై పలు సూచనలు చేశారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. వీపనగండ్లలో దాన్యం దించుకోవడానికి అనుకూలంగా ఉన్న గోదామును మరమ్మతుల కోసం మంత్రి ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



# భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచవద్దు

**- తహసీల్దారులతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల మే 29( విజన్ ఆంధ్ర) : జనగణన 2027 లో భాగంగా మొదట ఈ ఏడాది చేపట్టిన ఇండ్ల గణనను జూన్ 9వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు 2.18 లక్షల ఇండ్లు ఉండగా ఇప్పటివరకు ఎన్నుమరేటర్లు దాదాపు 1.79 లక్షల ఇళ్ల గణన పూర్తి చేశారని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. చార్జ్ అధికారులుగా ఉన్న తహసిల్దార్ లు, తమ పరిధిలోని సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లతో తరచూ మాట్లాడుతూ జిల్లాలో 95 శాతానికి పైగా హౌస్ లిస్ట్ ఆపరేషన్ జరిగేలా కృషి చేయాలన్నారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని, ఇతర భూ సంబంధ సమస్యలను కూడా అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లాలోని రేషన్ దుకాణాలను సంబంధిత మండలాల తహసిల్దార్లు, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసిల్దారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. అలాగే పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా ఉంచాలని, అవకతవకలకు పాల్పడే రేషన్ డీలర్లు, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాల పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ప్రత్యేక సవరణ ప్రక్రియ

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప,మే 29: (విజన్ ఆంధ్ర) ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం SIR 2026 ను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో Special Intensive Revision ` SIR 2026 పై జేసీ డి. నిధి మీనా, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితాల సమగ్రత అత్యంత కీలకమని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితాలు అవసరమని, అందుకే భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా గతంలో పలు దఫాలు SIR కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని, 2004 తర్వాత విస్తృత స్థాయిలో ఈ ప్రక్రియ జరగలేదని పేర్కొన్నారు. వేగవంతమైన పట్టణీకరణ, ఉద్యోగాలు, విద్య కోసం వలసలు పెరగడం, ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల నమోదయ్యే అవకాశాలు, మరణించిన లేదా అనర్హుల పేర్లు కొనసాగుతున్నాయనే అంశాల నేపథ్యంలో ఓటరు జాబితాల సమగ్ర పరిశీలన అవసరమైందన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకూడదనే దానితో పాటు, అనర్హుల పేర్లు జాబితాలో ఉండకుండా చూడడమేనని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గత ప్రత్యేక సమగ్ర సవరణలో నమోదైన వివరాలకు ప్రామాణికత కల్పించబడుతుందని చెప్పారు.ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరికి ముందుగా వివరాలు ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారమ్ (EF) ఇవ్వబడుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (BLO\T) ఇంటింటికీ వెళ్లి ఫారమ్‌లను పంపిణీ చేసి, వాటిని తిరిగి సేకరిస్తారని చెప్పారు. ఓటరు ఇంటి వద్ద లేని పక్షంలో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ స్వీకరించేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఫారమ్ సమర్పించిన ప్రతి అర్హ ఓటరి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని, ఫారమ్ అందని వారి పేర్లు ముసాయిదాలో ఉండకపోవచ్చని తెలిపారు. అయితే ఎవరైనా పేరు తొలగించే ముందు తప్పనిసరిగా వినతులు స్వీకరించి విచారణ జరిపి మాత్రమే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు నియమించే బూత్ లెవల్ ఏజెంట్లు (BLAs) కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కోరారు. దీూాం ద్వారా రోజుకు 50 వరకు ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించవచ్చని తెలిపారు. అలాగే క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల దశలో రోజుకు 10 వరకు దరఖాస్తులు ఇవ్వవచ్చని వివరించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం సమర్పించాలని చెప్పారు. పేరు తొలగింపుకు ఫారం-7, సవరణలు లేదా మార్పులకు ఫారం-8 ఉపయోగించాల్సి ఉంటుందని వివరించారు. ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ అనంతరం క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల ప్రక్రియ చేపడతామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలు, దరఖాస్తులు ERO కార్యాలయ నోటీస్ బోర్డులలో, CEO వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడతాయని, ప్రతి వారం రాజకీయ పార్టీలతో కూడా పంచుకుంటామని చెప్పారు.గత SIRలో నమోదైన వివరాలతో సరిపోలని సందర్భాల్లో విచారణ చేపట్టి అవసరమైతే పౌరసత్వం, నివాసం, జనన తేదీ వంటి అంశాలకు సంబంధించి ఆధారాలు పరిశీలిస్తామని తెలిపారు. అయితే ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమేనని, అది పౌరసత్వం లేదా జనన తేదీకి పూర్తి ఆధారం కాదని ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న వారు, బలహీన వర్గాల ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక వాలంటీర్లను నియమించి అవసరమైన సాయం అందించనున్నట్లు తెలిపారు.తుది ఓటరు జాబితా ప్రచురణ అనంతరం కూడా అసంతృప్తి ఉన్నవారికి జిల్లా మేజిస్ట్రేట్ స్థాయిలో మొదటి అప్పీల్, అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి రెండో అప్పీల్ చేసే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేయగా, వాటిని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎస్.ఐ.ఆర్., ఎలాక్టోర్ రోల్ పబ్లిష్, తదితర అన్ని అంశాల్లో.ప్రజలను తప్పుద్రోవ పట్టించే సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతలను నమ్మకుండా. అన్ని పార్టీల ప్రతినిధులు.. ప్రజలకు, ఎలక్టోరల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని ఏ మాత్రం మిస్ అవ్వకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు డా. బి. శ్రీనివాసులు (AAP), ఎస్. గురప్ప (BSP), జి.ఎస్.టి. లక్ష్మణరావు (BJP),జి. చంద్రశేఖర్ (సీపీఐ ఎం), బి. పాల్ సుధాకర్ (INC), పి. విశ్వనాథ్ (జనసేన పార్టీ), వైఎస్ జబీవుల్లా (ఎజా), పి. సునీల్ కుమార్ (YSRCP) తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సీఎండీ విస్తృత పర్యటన

**- ఉత్పత్తి, భద్రత, కార్మిక సంక్షేమంపై సమీక్ష**

**- జీడీకే-11 గనిలో మ్యాన్ రైడింగ్ వ్యవస్థ ప్రారంభం**

**- కార్మికులకు సురక్షిత, వేగవంతమైన రవాణా సౌకర్యం**

**- ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమిష్టిగా కృషి చేయాలి**

**- సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి**



పెద్దపల్లి బ్యూరో చీఫ్,మే 29 (విజన్ ఆంధ్ర) : సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి రామగుండం-1 ఏరియాలో విస్తృతంగా పర్యటించి గనుల ఉత్పత్తి, కార్మిక సంక్షేమం, భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. జీడీకే-11 ఇంక్లైన్ గనిలో ఉద్యోగులు, కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి బొగ్గు ఉత్పత్తి పెంపు, నాణ్యత, ఉత్పాదకత అలాగే భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. సింగరేణి సంస్థ క్రమశిక్షణ, సమిష్టి పనితత్వంతో ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ సందర్భంగా గనిలో ఏర్పాటు చేసిన ఐదవ మ్యాన్ రైడింగ్ వ్యవస్థను ప్రారంభించి కార్మికులు సురక్షితంగా, వేగంగా పని ప్రదేశాలకు చేరుకునేలా ఈ సౌకర్యం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ వ్యవస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను సన్మానించి అభినందించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ జీడీకే-11 గని అత్యధిక యాంత్రీకరణ కలిగిన రెండవ అతిపెద్ద గని అని తెలిపారు. డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు గని ఉత్పత్తిని భవిష్యత్తులో పదిహేను లక్షల టన్నులకు పెంచే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. అనంతరం సీఎండీ జీడీకే-5 ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి, రవాణా, యంత్రాల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. తరువాత జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని సందర్శించి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అందిస్తున్న క్రీడా సదుపాయాలను పరిశీలించారు. అనంతరం అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉత్పత్తి లక్ష్యాలు, భద్రతా ప్రమాణాలు, వ్యయ నియంత్రణ, నాణ్యత అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చర్ల మండల ప్రజల దాహార్తిని తీరుస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**- రూ. 12 లక్షల ఎంపీ నిధులతో 8 బోర్లు మంజూరు**

**- ముమ్మరంగా ప్రారంభమైన పనులు**



చర్ల, మే 29 (విజన్ ఆంధ్ర): చర్ల మండల ప్రజల దాహార్తిని తీర్చడానికి బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ప్రాతినిధ్యంతో, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుండి సుమారు 12 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు, ఈ నిధులతో మొదటి విడతగా మండలంలోని 8 గ్రామ పంచాయతీలలో 8 బోర్లను వేపిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆయా గ్రామాల్లో బోర్ల నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా ప్రారంభించారు, ఈరోజు కుదునూరు గ్రామంలో స్థానిక సర్పంచ్ కుంజ కమల మరియు ఉప సర్పంచ్ సిద్ధి కిరణ్ చేతుల మీదుగా కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు, అనంతరం ఆర్ కొత్తగూడెం ఎస్సీ కాలనీలో సర్పంచి తుర్రం రవి, గొర్ల రాజబాబు, కూరపాటి వీర్రాజు కొబ్బరికాయలు కొట్టి బోర్ల ఏర్పాటును మొదలుపెట్టారు. అదేవిధంగా తిప్పాపురం పంచాయతీలో కారం కన్నారావ్ కొబ్బరికాయ కొట్టి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ మంచి సమయంలో బోర్లు వేయించి తమ తాగునీటి ఎద్దడిని నివారించినందుకు గాను స్థానిక ప్రజలు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ బోర్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, డివిజన్ నాయకులు నాతని రాము, యువజన నాయకులు కాకి అనిల్, తడికల బుల్లేబాయ్, స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాపాలన కాదు.... రైతు దగా పాలన

**- మొలకెత్తుతున్న వడ్లు కన్నీళ్లలో రైతన్న**



ములుగు మే 29, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు ఆకస్మికంగా సందర్శించి గత 40 రోజులుగా ధాన్యం విక్రయించేందుకు నిరీక్షిస్తున్న రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకుని ప్రజా పాలన కాదు రైతు దగా పాలన అని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. అకాల వర్షాలకు తడిసి వడ్లు రంగు మారి ముక్కిపోయి, మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు ఒక ప్రకటనలో మాట్లాడుతూ, స్థానిక మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారంలో ఉంటే రైతుల కష్టాలు పట్టవా? ఒక్క పూట వచ్చి ఐకేపీ కేంద్రంలో పరిస్థితి చూసే తీరిక లేదా?“ అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో 40 రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయాయని, తేమ, తరుగు పేరుతో క్వింటాకు 4-5 కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రాల వద్ద సరిపడా గోనె సంచులు, హమాలీలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయాలని, వర్షాలకు నష్టపోయిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు కన్నీరు కారిస్తే ఆ పాలనకు మనుగడ ఉండదనీ రైతు ఉసురు తగులుతుందనీ ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం“ అని కాకులమర్రి లక్ష్మణ్ బాబు హెచ్చరించారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాని విజయవంతం చేయండి

**- డాక్టర్ పిడమర్తి రవి**

జూన్ 21 2026 ఇందిరా పార్కులో నిర్వహించ తలపెట్టిన ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం సన్నాక సమావేశంలో భాగంగా ఈరోజు మేడ్చల్ మెదక్ కామారెడ్డి నిజామాబాదులో పర్యటించిన పిడమర్తి రవి గారు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం పింఛన్ మరియు గుర్తింపు కార్డు ఇవ్వాలి అనే ప్రధాన డిమాండ్తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరూ జూన్ 21న వేలాదిగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు



# దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

**- అదనపు కలెక్టర్ ఫైజాన్ మహమ్మద్,**




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,మే29,(విజన్ ఆంధ్ర ప్రతినిధి):దేశంలోనే మొట్ట మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసులలో బాధితులకు 2 బిహెచ్ కె ఇల్లు కేటాయించి అందించే నిర్ణయం తీసుకోవడం గర్వకారణమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులతో కలిసి అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,విజయేందర్ రెడ్డి లు హాజరైనారు.ఈసందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల 25వ తేదిన తహసీల్దార్లు తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే సమావేశాన్ని నిర్వహించాలన్నారు.సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను త్వరిగతిన జారీ చేయాలన్నారు.పోలీసు శాఖ వారు పెండింగ్ కేసుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని తద్వారా కమీషన్ వారికి పురోగతి కనిపిస్తుందన్నారు.మన జిల్లాలో ఒకరే పిపి ఉండడం వల్ల వారి అభిప్రాయానికి ఎక్కువ సమయం పడుతుందని మరొక పిపిని నిర్ణయించడానికి కమీషన్ వారు డివిఎంసి కమిటీ ద్వారా తగిన చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. తప్పనిసరిగా మూడు నెలలకొకసారి డివిజన్ స్థాయిలో నిర్వహించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలన్నారు.సఫాయి కర్మచారిల గురించి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.సఫాయి కర్మచారిలకు అందించే పిపిఈ కిట్, ప్రొటెక్టివ్ కిట్లను క్రమం తప్పకుండా అందించేందుకు మున్సిపల్ కమీషనర్లు, జోనల్ కమీషనర్లకు కలెక్టర్ ద్వారా లేఖలు అందజేస్తామన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతంరిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఈఓ ను ఆదేశించారు.అంతకు ముందుగా గతంలో నిర్వహించిన డివిఎంసి సమావేశంలోని మినిట్స్ ప్రకారం పెండింగ్ కేసుల వివరాలను పోలీసు,రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు.ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు జిల్లా శంకర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టి కమీషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను దత్తత తీసుకుందని తెలిపారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసులలో బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ద చూపించాలని బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం వెంటనే అందించేలా చర్యలు తీసుకోవలన్నారు.ఈ కేసులలో కుల ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కేసుల పెండింగ్,పురోగతి పై పోలీసు శాఖల అధికారులతో వివరాలు అడిగి తెలుసుకొని పెండింగ్ కేసులకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. క్లిష్టమైన సమస్యలు ఉన్నట్లయితే కమీషన్ దృష్టికి తీసుకువస్తే తమ వంతు సహాకారం అందించి ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఇటీవల అద్రాస్పల్లీలో జరిగిన శ్రీరామ నవమి కళ్యాణకార్యక్రమంలో కొందరు దళితులకు ఆలయ ప్రవేశం కల్పించడక పోవడం వంటి సంఘటనలు జరిగాయని,కమీషన్ హాజరై ఇరువర్గాల ప్రజలతో మాట్లాడి ఒకరినొకరు గౌరవించుకొని పండుగలు సంప్రదాయ పద్దతిలో జరుపుకోవాలని నిర్ణయించి, ముగ్గురి పై నమోదు చేసిన అట్రాసిటి కేసులను కూడా వెనక్కు తీసుకునేలా చేసామని ఇందులో పోలీసు వారి పాత్ర ప్రధానమైనదన్నారు. ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అందుకే సివిల్ రైట్ డేను ప్రత్యేకంగా నిర్వహించి అమలు జరిగేలా చూడాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.దీంతో పాటు అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈరోజు జరిగిన సమావేశ మినిట్స్ ను తదుపరి నిర్వహించే సమావేశానికి పోలీసులు, వివిధ శాఖల అధికారులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు 2 బిహెచ్ కె ఇళ్లతోపాటు అదనంగా ఉపాధి, పెన్షన్ కూడా అందించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు సహాకరించాలన్నారు. డివిఎంసి సభ్యులు తమ దృష్టికి వచ్చిన ఎస్సీ ఎస్టీల సమస్యలను తెలుపగా అదనపు కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తగు సూచనలు జారీ చేసారు.ఈసమావేశంలో ఎస్సీ,ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్,డివిఎంసి సభ్యులు, డిఆర్ఓ మాలతి, ఆర్డిఓలు రాజేష్ కుమార్, శ్యాంప్రకాష్,పోలీసు ఉన్నత అధికారులు,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చోరీ నిందితులు అరెస్ట్ బంగారం వెండి స్వాధీనం

**- 8 మంది వ్యక్తులు అరెస్టు**

**- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**- బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం**

**- జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ ప్రశంసలు**



మంగపేట మే 29 (విజన్ ఆంధ్ర) రిపోర్టర్ : మండలంలోని గంపోనిగూడెం కమలాపురం బోరనర్సాపూర్ పలు గ్రామాల్లో జరిగిన వరుస బంగారం, వెండి ఆభరణాల దొంగతనాలను చేసిన దొంగలను మంగపేట పోలీసులు ఏంతో చాకచక్యంగా వ్యవహరించి 8 మంది వ్యక్తులు అరెస్టు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.ఈ దొంగలపై గతంలో చాలా కేసులు నమోదై వున్నాయని నిందితులు కమలాపురం, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన వారిగా గుర్తించినట్లు వారి వద్ద నుండి 1తులం 1/2 బంగారం 40 తులాల వెండి వస్తువులు మూడు బైక్ లు 30 కిలోల కాపర్ వైర్ మూడు సెల్ ఫోన్లు రూ 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏటూరునాగారం సిఐ అనుమల శ్రీనివాస్ తన కార్యాలయంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ శ్రీనివాస్ మంగపేట ఎస్సై టివిఆర్ సూరి సెకండ్ ఎస్ఐ శ్రీకాంత్ లు మాట్లాడుతూ వేసవికాలంలో ఆరుబయట నిద్రించే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వాటిని చేదించాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించినందుకు ఏటూరునాగారం ఏఎస్పి శ్రీ మనాన్ భట్, సిఐ అనుమల శ్రీనివాస్, మంగపేట ఎస్సై టివిఆర్ సూరి, ఏఎస్ఐ శ్రీకాంత్ పోలీసు సిబ్బంది మోహన్ రమేష్ ప్రసాద్ నరేష్ లను జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్ నాథ్కేకన్ ప్రశంసించారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 29, విజన్ ఆంధ్ర : జిల్లాలోని రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ ప్రాంతంలో జూన్ 1వ తేదీన నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం బహిరంగ సభస్థలి ఏర్పాట్లను ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, మంచిర్యాల, ఖానాపూర్ నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, వెడ్మ బొజ్జు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, భారీ కేడింగ్, ప్రముఖులు వచ్చే రూట్లు ఇతర అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. బహిరంగ సభ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలి

*రెండో రోజు బీజేపీ ప్రశిక్షణా కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..*




నిజామాబాద్ మే29:( విజన్ ఆంధ్ర) బీజేపీ భావజాలాన్ని కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు.నగరంలోని బోర్గాం లో కొనసాగుతున్న బీజేపీ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలు లేనప్పుడు కూడా సమాజంలో పార్టీ పని నిరంతరం జరిగే విధంగా చూడాలన్నారు. అన్ని అనుబంధ సంస్థలతో సమన్వయం ఏర్పరచుకోవాలన్నారు. సంస్థలు వేరువేరు రంగాల్లో పనిచేసిన లక్ష్యం మాత్రం ఒకటేనని చెప్పారు. ప్రపంచంలో భారత్ స్థానం గౌరవం పెరిగిందని, మోడీ నేతృత్వంలో అనేక పథకాలు గ్రామస్థాయి వరకు కూడా చేరుతున్నాయన్నారు.

**రాష్ట్ర ఇంచార్జీకి సన్మానం...**

తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి, కర్ణాటకలోని బెల్గావి ఎమ్మెల్యే అభయ్ పాటిల్ జిల్లా ప్రశిక్షణా తరగతుల ముగింపు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ వారిని ఘనంగా సన్మానించారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటాం ములుగు జిల్లా ఎస్పీ

## శాలువాతో సన్మానించిన జే జాక్ కో కన్వీనర్ పోలోజు రామ్మూర్తి.



ములుగు మే 29, విజన్ ఆంధ్ర ప్రతినిధి : "విధి నిర్వహణలో జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పోలీస్ శాఖ అండగా ఉంటుంది" అని ములుగు జిల్లా ఎస్పీ కె.ఎన్. సుధీర్ రామ్నాథ్ కేకన్ స్పష్టమైన భరోసా ఇచ్చారు. జే జే జాక్ – జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఎస్పీ ఈ మేరకు హామీ ఇచ్చారు. జాక్ కో కన్వీనర్, టీ న్యూస్ ములుగు జిల్లా రిపోర్టర్ పోలోజు రామూర్తి ఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపి అనంతరం యూనియన్లకు అతీతంగా జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా పోలోజు రామూర్తి మాట్లాడుతూ, "క్షేత్రస్థాయిలో వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులకు ఎదురవుతున్న భద్రతాపరమైన ఇబ్బందులు, అధికారుల నుంచి సహకారం అందని పరిస్థితులను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన చాలా సానుకూలంగా స్పందించారు" అని తెలిపారు. దీనిపై ఎస్పీ సుధీర్ రామ్నాథ్ స్పందిస్తూ, "ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకం. నిష్పాక్షికంగా, నిర్భయంగా వార్తలు రాసేందుకు పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుంది. జర్నలిస్టుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం" అని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమమే జే జే జాక్ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా అన్ని యూనియన్లను కలుపుకొని ముందుకు వెళ్తామని రామూర్తి స్పష్టం చేశారు.

# ఈనెల 31న వనపర్తిలో భారీ బహిరంగ సభ

## బీసీ ఎస్సీ ఎస్టీ- జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ విశారదన్ రాక!




వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 29 (విజన్ ఆంధ్ర) ఈనెల 31న ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ,ఎస్సి, ఎస్టి జేఏసీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం రాజ్యాధికారం" కై"వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఎవరి కులం ఎంతో! వారికంత వాటా!! భారీ బహిరంగ సభ సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నట్లు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వనపర్తి జిల్లా కన్వీనర్ చిలుక బాలరాజ్ సాగర్, వీరపాగ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వేల సంవత్సరాల నుండి తెలంగాణ ప్రాంతం అతిపెద్ద అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థ ఈ వ్యవస్థ కింద బీసీ ఎస్సీ ఎస్టీలు 90% జనాభా కులాలు ఉన్నప్పటికీ తరతరాలుగా దోపిడీకి గురై బానిసలుగా బతుకుతున్నారని నలిగిపోయి కాలిపోయి నశించిపోయారని తమ జీవితాలను ధ్వంసం మైపోయాయని ఆరోపించారు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలైన రోజు నుండి ఈ బీసీ, ఎస్సీ,ఎస్టీ జీవితాలలో కొంత మార్పు ప్రారంభం అయిందని కానీ ఆ కొద్దిగా మార్పు తరతరాల తమ జీవితంసానికి ఏమాత్రం సరిపోదని బీసీ, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు అన్నారు. మూడున్నర కోట్ల మంది బీసీ ఎస్సీ ఎస్టీ ల బానిసత్వం కటిక పేదరికం అణిచివేత బద్దలు కావాలంటే ఒక రాజకీయ భూకంపం ఈ జనంలో రావాలని పిలుపునిచ్చారు. అందుకోసం ప్రజలు సామాజిక న్యాయం సమరం సాగాలని రాజ్యాధికార యుద్ధం రగిలించాలని పిలుపు నిచ్చారు. అదే అసలైన ప్రజాస్వామ్యం గణతంత్ర రాజ్యానికి పునాది అవుతుందని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్సిరాం కోరుకున్న కలలు కన్నా బహుజనుల రాజ్యం రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం రాజ్యం కై యుద్ధం వైపు నడుం బిగించాలని ఇందుకోసం ఈనెల 31న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించే ఎవరి కులం ఎంతో! వారికంత వాటా! భారీ బహిరంగ సభకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజలు, విద్యావంతులు, మేధావులు యువకులు భారీ ఎత్తున తరలిరావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు అశోక్, కురుమన్న, కొండన్న యాదవ్ పిలుపునిచ్చారు.


# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) పకడ్బందీగా చేపట్టాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి**



నిర్మల్ జిల్లా, మే 29,(విజన్ ఆంధ్ర); ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్2026 పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేసి, పూర్తి చేసిన వివరాలను సేకరించాలన్నారు. ఓటర్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లోనే తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. సూపర్వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఏఈఆర్‌వోలు (అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు), ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాల్లోని అటవీప్రాంత ప్రజలందరికీ మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.



నిర్మల్ జిల్లా, మే 29,(విజన్ ఆంధ్ర); శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అటవీ ప్రాంతాల్లో టెలికాం సేవల మెరుగుదల, తదితర మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంత ప్రాంత ప్రజలకు మెరుగైన ఇంటర్నెట్, రవాణా, పారిశుద్ధ్యం, తదితర మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రతి అంశం ఇంటర్నెట్ తో ముడిపడి ఉన్నందున, ప్రజలందరికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇంటర్నెట్ సౌకర్యానికి సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా ముఖ్య పట్టణాలకు అనుసంధానం పెరిగి వారి వారికి మేలు కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన వీవోఏలు

**- సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేత**

**- సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్**

రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 29 (విజన్ ఆంధ్ర): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐకేపీ వ్యవస్థలో పనిచేస్తున్న వీవోఏలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్) తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా వీవోఏలు తమ ప్రధాన డిమాండ్లపై సమగ్ర మెమోరాండంను ప్రభుత్వ విప్‌కు సమర్పించారు. ఉద్యోగ భద్రత, సీబీఓ హెచ్ఆర్ పాలసీ అమలు, గౌరవప్రదమైన వేతనం, సంక్షేమ పథకాల కల్పన, సేవా నియమాల రూపకల్పన వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వీవోఏల సమస్యలపై సానుకూలంగా స్పందించి, వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీవోఏల న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రజాప్రతినిధుల మద్దతు లభించడం సానుకూల పరిణామమని సంఘ నాయకులు పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి అనుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, సిరిసిల్ల, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట మండలాల వీవోఏ సంఘాల అధ్యక్షులు కొప్పుల రమ, సుధారాణి, పద్మ, జ్యోష్ణ, ఆడపు శోభ, మంజుల పాల్గొన్నారు. అలాగే సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, డైరెక్టర్ మెండే శ్రీనివాస్, అనవేని రవి తదితరులు హాజరయ్యారు.

# చదువే జీవితాన్ని మార్చే మహాశక్తి

**డాక్టర్ బండి సాయన్న గౌడ్**

**గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహణ**



జగిత్యాల జిల్లాలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందిస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువేనని పేర్కొన్నారు. నేటి సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతోందని, పేదరికాన్ని జయించి కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చదువు మాత్రమే మార్గమని తెలిపారు. సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించాలంటే విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, లక్ష్యసాధన, కష్టపడి చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ దశలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వంటివని, ఈ దశలో సాధించిన విజయాలు ఉన్నత స్థానాలకు తీసుకెళ్తాయని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయాల వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. విద్యార్థుల అభివృద్ధికి కుటుంబ సహకారం, గురువుల మార్గదర్శనం అత్యంత అవసరమని తెలిపారు. ప్రస్తుతం యువత సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లకు ఎక్కువ సమయం కేటాయిస్తూ చదువుపై దృష్టి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమాజ అభివృద్ధికి విద్యావంతులైన యువత అవసరమని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని, ఇలాంటి ప్రతిభా పురస్కారాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకుని నిరంతరం శ్రమిస్తే తప్పకుండా విజయాన్ని అందుకుంటారని, "కష్టం చేసిన వారికి విజయం ఖాయం" అనే నమ్మకంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చెక్కళ్ల మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ, పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభా పురస్కారాలు అందుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టు మాత్రమేనని అన్నారు. ఇంకా ఉన్నత చదువులు అభ్యసించి అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా గౌడ్ సమాజానికి చెందిన అర్హులైన వారిని గోపాలో సభ్యులుగా చేర్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తినీ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ చదువులో ప్రతిభ నిరూపించుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్యాణ్ చక్రవర్తి గౌడ్ మాట్లాడుతూ, మారుమూల గ్రామాల నుంచి వచ్చి కష్టపడి చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ధైర్యంగా ముందుకు సాగాలని, చిన్న చిన్న సమస్యలకు భయపడి ఆత్మహత్యల వంటి తప్పుదారులు ఎంచుకోకూడదని సూచించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యల్మకంటి మీరయ్య గౌడ్ మాట్లాడుతూ, సెల్‌ఫోన్‌ను కేవలం విద్యా అవసరాల కోసమే ఉపయోగించాలని సూచించారు. గూగుల్ వంటి వనరులను ఉపయోగించి ప్రతిరోజూ కొత్త పదాలు, వాక్యాలు నేర్చుకుంటే ఆంగ్ల భాషపై మంచి పట్టు సాధించవచ్చని తెలిపారు. జిల్లా ఆర్డీవో మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ఒక ఇంట్లో ఆడపిల్ల చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అడిషనల్ సబ్ కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు పలు సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తల్లిదండ్రులు చదువుకునే పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కాసారపు శాంతికుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు దుర్గపు రవిందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య గౌడ్, కోశాధికారి గుర్రం సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు బాలసాని సత్తయ్య గౌడ్, దుర్గపు శ్రీనివాస్ గౌడ్, తిరుమల సదాశివ గౌడ్, పొన్నం రమేష్ గౌడ్, యాగాండ్ల చిరంజీవి గౌడ్, కార్యనిర్వాక కార్యదర్శులు, బుర్ర శివక్రిష్ణ గౌడ్, సంయుక్త కార్యదర్శి స్వప్న గౌడ్, కార్యవర్గ సభ్యులు, పోతుగంటి వెంకటేశ్వర్లు గౌడ్, సలహాదారులు, గూడాల రాజేశం గౌడ్, కాసారపు లక్ష్మి నారాయణ గౌడ్, నేరేళ్ల మల్లేశం గౌడ్, కరబూజ రవీందర్ గౌడ్, మంద మల్లేశం గౌడ్, డాక్టర్ తీగల నరేంద్ర గౌడ్ లు, గోపా నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# వనపర్తిలో ఒక్క పూరి గుడిసె లేకుండా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం

**- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి**





వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 29 (విజన్ ఆంధ్ర) : వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి, ఆడపడుచులకు అండగా ఉంటా రానున్న కాలంలో వనపర్తి నియోజకవర్గం లో ఒక్క పూరి గుడిసె లేకుండా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం – వనపర్తి నియోజకవర్గ శాసన సభ్యులు తూడి మెఘా రెడ్డి వనపర్తి నియోజకవర్గంలో ప్రతి ఆడపడుచుకు నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్థానిక శాసనసభ్యులు తోడి మేఘారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కుల పంపిణీ, ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమంలో శాసన సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికై అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. డిసెంబర్ 7 2023న ప్రభుత్వం ఏర్పాటు అయినా వెంటనే మొదటగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేసేందుకు మొదటి సంతకం చేసిందన్నారు. ఆర్టీసీలో మహిళలు ఉచిత ప్రయాణానికి ఒక్క వనపర్తి జిల్లాలోనే ఇప్పటివరకు 30.29 కోట్ల రూపాయలు ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం ధర చెల్లించడం జరిగింది అన్నారు. ఆరోగ్య భీమాను 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచడం జరిగిందని అదేవిధంగా జిల్లాలో 30 వేల తెల్ల రేషన్ కార్డులు కొత్తగా ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి తెల్ల రేషన్ కార్డు పై ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వము విద్యా వైద్యానికి తొలి ప్రాధాన్యం ఇచ్చిందని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, అల్పాహారం, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు 6000 మంది కొత్త టీచర్లకు నియామకం చేసినట్లు తెలిపారు. జిల్లాలో 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో రూ. 207 కోట్ల వ్యయంతో 500 పడకల ఆసుపత్రి మంజూరీ చేసినట్లు చెప్పారు. ఐ.టి. టవర్, పాలిటెక్నిక్ కళాశాల భవనానికి పూర్వ వైభవం తీసుకురావడానికి 10 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో 70 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి రోడ్లు వేయడం జరిగిందని, మరో 30 కోట్ల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అందుకే ఏ సంక్షేమ పథకం అయినా మహిళలే ప్రాతినిధ్యం వహించే విధంగా రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. త్వరలో వనపర్తి మహిళలకు డీజిల్ బంక్ మంజూరు కాబోతుందని, 546 ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికే మంజూరు అయ్యాయని, ప్లాట్లు లేని నిరుపేదలకు 1000 ప్లాట్లు మంజూరు చేసి అందులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే విధంగా ప్రభుత్వానికి తాను ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె లేకుండా అన్ని పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ గృహ ప్రవేశానికి తన స్వంత డబ్బులతో లబ్ధిదారులకు పట్టు బట్టలు పెట్టి గృహ ప్రవేశం చేయిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు సూపర్ మార్కెట్, రైస్ మిల్లు, గోదాములు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు జిల్లాలో ఇప్పటి వరకు 83.76 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు ఇవ్వడం జరిగిందని, మొదటి విడతలో మహిళలకు ఉచితంగా 12669 ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తే ఇప్పుడు మలి విడతలో 15000 ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఎన్. ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ మహిళల చేతుల్లో సంసారం ఉంటేనే కుటుంబం బాగుపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. అందుకే అన్ని సంక్షేమ పథకాలు మహిళలకే ఇస్తున్నట్టు చెప్పారు. వడ్డీలేని రుణాలు 5నుండి 10 లక్షలకు పెంచినట్లు వివరించారు. ప్రమాద వశాత్తూ సంఘంలో ఉన్న మహిళా చనిపోతే తీసుకున్న రుణం మొత్తం మాఫీ అయిపోయే విధంగా ప్రభుత్వమే బీమా చేసినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్ , బస్సులు, గోదాములు అన్ని మహిళలకే ఇస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించి ఆర్థిక సాధికారతకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలియజేశారు . వనపర్తి జిల్లాలో ఇప్పటికే 12 వేల పై చిలుకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పుడు రెండవసారి 15000 చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ పడుతుందని, మహిళలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యాపార వేత్తలుగా ఎదగాలను ఆకాంక్షించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు సైతం మాట్లాడారు. మహిళలు పెద్దమొత్తంలో పాల్గొన్నారు. అనంతరం శాసన సభ్యుల చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు రూ. 3.40 కోట్ల బ్యాంక్ లింకేజ్ చెక్కును, మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.


# ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు పెంచాలి

**- బడిబాట సమర్థవంతంగా నిర్వహించాలి**

**- మౌలిక సదుపాయాలు, మరమ్మతులు పూర్తి చేయాలి**

**- సకాలంలో సరుకుల టెండర్ల ప్రక్రియ**

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) మే 29.బడిబాట కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లను పెంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు తదితర విభాగాల ఉన్నతాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న విద్యాసంస్థల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మరమ్మతులు చేయించాలని అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు అపాయం సంభవించకుండా సరైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎక్కువ మంది విద్యార్థులు ఉండే పాఠశాలలు, హాస్టళ్లలో ఎక్కువ మంది సిబ్బంది, ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లు ప్రారంభమయ్యేలోగా కామన్ డైట్ మెనూకు అవసరమైన సరుకుల టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి నాణ్యమైన సరుకులకు టెండర్లు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్, పుస్తకాలు తదితర మెటీరియల్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ డిడి తిరుపతిరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఆర్.సి.ఓ అంజలి, విద్యాశాఖ ఏడి మాధవి, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో యాదాద్రి కో-ఆప్ క్రెడిట్ సొసైటీ 4వ బ్రాంచ్ ప్రారంభం

### ప్రారంభించిన మాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్,జక్క వెంకట్ రెడ్డి,అమర్ సింగ్



బోడుప్పల్,మే 29(విజన్ ఆంధ్ర) : మేడ్చల్ జిల్లా బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ బుధానగర్‌లో యాదాద్రి కో-ఆప్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ 4వ బ్రాంచ్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పీర్జాదిగూడ మాజీ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, ఠాకూర్ అమర్ సింగ్ పాల్గొని బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నమ్మకమైన ఆర్థిక సేవలు అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. యాదాద్రి కో-ఆప్ క్రెడిట్ సొసైటీ ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ విస్తరిస్తుండటం అభినందనీయమన్నారు. పీర్జాదిగూడ ప్రాంత ప్రజలకు ఈ కొత్త బ్రాంచ్ ద్వారా మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. యువత స్వయం ఉపాధి, చిన్న వ్యాపారులకు సహకార సంఘాలు అండగా నిలవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి,బీంరెడ్డి నవీన్ రెడ్డి,మేడ్చల్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు వంగేటి ప్రభాకర్ రెడ్డి,ఫీర్జాదిగూడ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గందె విశ్వం గుప్తా,బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు పైళ్ళ ప్రభాకర్ రెడ్డి సంస్థ చైర్మన్ బచ్చు శ్రీనివాస్,సీఈఓ గోలనుకొండ రాంబాబు,డైరెక్టర్లు,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 29,(విజన్ ఆంధ్ర ప్రతినిధి):ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు కుత్బుల్లాపూర్ ప్రాజెక్టులోనీ బాపూజీ నగర్ సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్స్,జిల్లా సంక్షేమ అధికారి శారద ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా సంక్షేమ శాఖ అధికారి శారద మాట్లాడుతూ, గర్భిణి అయిన నుండి ఆ బిడ్డకి 2 సంవత్సరాల తొలి 1000 రోజులు – బంగారు భవిష్యత్తుకు పునాది అన్నారు, గర్భధారణ నుండి 2 సంవత్సరాల వరకు పిల్లలు సమగ్ర సమగ్ర అభివృద్ధికి మన అందరి బాధ్యత అని వారు అన్నారు.ప్రారంభ బాల్య సంరక్షణ,అభివృద్ధి ఈ సి డి, కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాల ద్వారా 1000 రోజుల బాలల సంరక్షణ,పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ , పిల్లల సమగ్ర అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నాము,ఈకార్యక్రమాలలో భాగంగా



గర్భిణీలు,బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్రత,మానసిక మరియు శారీరక అభివృద్ధి అంశాలపై శిక్షణ ఇవ్వబడుతుందనీ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లు ఎదుగుదల,ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించడంతో పాటు, తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు అందించబడతాయి. అలాగే,ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార ప్రదర్శనలు,తల్లిదండ్రుల సమావేశాలు,పిల్లల ఆటల కార్యక్రమాలు మరియు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుచున్నాము. పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన 6 ముఖ్య అంశాలైన పోషణ, ఆరోగ్యం, ప్రారంభ విద్య మరియు నేర్చుకోవడం, స్పందనాత్మక శిశు సంరక్షణ, భద్రత మరియు రక్షణ,తల్లిదండ్రుల శ్రేయస్సు గురించి చెప్పారు.అదేవిధంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం తీసుకోవడం, తల్లిపాల ప్రాధాన్యత, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, స్పందనాత్మక పేరెంటింగ్, ఆటల ద్వారా నేర్చుకోవడం, బాలామృతం వినియోగం, హోమ్ విజిట్స్ ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పిస్తున్నాము. పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి కుటుంబం ప్రారంభ బాల్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో సిడిపిఓలు, ఐసిడిఎస్ సూపర్వైజర్స్,అంగన్వాడి టీచర్స్, పిల్లల తల్లులు, గర్భిణీలు,బాలింతలు, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లల తల్లులు పాల్గొన్నారు. జిల్లాలో వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాలలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

## దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,మే29,(విజన్ ఆంధ్ర ప్రతినిధి):దేశంలోనే మొట్ట మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసులలో బాధితులకు 2 బిహెచ్ కె ఇల్లు కేటాయించి అందించే నిర్ణయం తీసుకోవడం గర్వకారణమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులతో కలిసి అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,విజయేందర్ రెడ్డి లు హాజరైనారు.ఈసందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల 25వ తేదిన తహాసీల్దార్లు తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే సమావేశాన్ని నిర్వహించాలన్నారు.సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను త్వరిగతిన జారీ చేయాలన్నారు.పోలీసు శాఖ వారు పెండింగ్ కేసుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని తద్వారా కమీషన్ వారికి పురోగతి కనిపిస్తుందన్నారు.మన జిల్లాలో ఒకరే పిపి ఉండడం వల్ల వారి అభిప్రాయానికి ఎక్కువ సమయం పడుతుందని మరొక పిపిని నిర్ణయించడానికి కమీషన్ వారు డివిఎంసి కమిటీ ద్వారా తగిన చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. తప్పనిసరిగా మూడు నెలలకొకసారి డివిజన్ స్థాయిలో నిర్వహించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలన్నారు.సఫాయి కర్మచారిల గురించి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.సఫాయి కర్మచారిలకు అందించే పిపిఈ కిట్, ప్రొటెక్టివ్ కిట్లను క్రమం తప్పకుండా అందించేందుకు మున్సిపల్ కమీషనర్లు, జోనల్ కమీషనర్లకు కలెక్టర్ ద్వారా లేఖలు అందజేస్తామన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతంరిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని



డిఈఓ ను ఆదేశించారు.అంతకు ముందుగా గతంలో నిర్వహించిన డివిఎంసి సమావేశంలోని మినిట్స్ ప్రకారం పెండింగ్ కేసుల వివరాలను పోలీసు,రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు.ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు జిల్లా శంకర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టి కమీషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను దత్తత తీసుకుందని తెలిపారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసులలో బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం వెంటనే అందించేలా చర్యలు తీసుకోవలన్నారు.ఈ కేసులలో కుల ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కేసుల పెండింగ్,పురోగతి పై పోలీసు శాఖల అధికారులతో వివరాలు అడిగి తెలుసుకొని పెండింగ్ కేసులకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. క్లిష్టమైన సమస్యలు ఉన్నట్లయితే కమీషన్ దృష్టికి తీసుకువస్తే తమ వంతు సహాకారం అందించి ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఇటీవల అద్రాస్పల్లీలో జరిగిన శ్రీరామ నవమి కళ్యాణకార్యక్రమంలో కొందరు దళితులకు ఆలయ ప్రవేశం కల్పించడక పోవడం వంటి సంఘటనలు జరిగాయని,కమీషన్ హాజరై ఇరువర్గాల ప్రజలతో మాట్లాడి ఒకరినొకరు గౌరవించుకొని పండుగలు సంప్రదాయ పద్దతిలో జరుగుపుకోవాలని నిర్ణయించి, ముగ్గురి పై నమోదు చేసిన అట్రాసిటి కేసులను కూడా వెనక్కు తీసుకునేలా చేసామని ఇందులో పోలీసు వారి పాత్ర ప్రధానమైనదన్నారు. ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) ▪ పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ ▪ పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అందుకే సివిల్ రైట్ డేను ప్రత్యేకంగా నిర్వహించి అమలు జరిగేలా చూడాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.దీంతో పాటు అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈరోజు జరిగిన సమావేశ మినిట్స్ ను తదుపరి నిర్వహించే సమావేశానికి పోలీసులు, వివిధ శాఖల అధికారులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు 2 బిహెచ్ కె ఇళ్లతోపాటు అదనంగా ఉపాధి, పెన్షన్ కూడా అందించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు సహకరించాలన్నారు. డివిఎంసి సభ్యులు తమ దృష్టికి వచ్చిన ఎస్సీ ఎస్టీల సమస్యలను తెలుపగా అదనపు కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తగు సూచనలు జారీ చేసారు.ఈసమావేశంలో ఎస్సీ,ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్,డివిఎంసి సభ్యులు, ఆర్ఓ మాలతి, ఆర్డిఓలు రాజేష్ కుమార్, శ్యాంప్రకాష్,పోలీసు ఉన్నత అధికారులు,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నేత్రాల నీడలో ఎన్నికల సామగ్రి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 29 ( విజన్ ఆంధ్ర) : వికారాబాద్ జిల్లా తహసీల్దార్ కార్యాలయము పరిధిలో ఉన్న బ్యాలట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచిన గోదామును జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారము పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు పోస్టల్ బ్యాలెట్ల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదాంలో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు నిరంతరం పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు, నేమత్ హోలి పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో రూ.80 లక్షలతో నూతన ప్రభుత్వ పాఠశాల భవనానికి శంకుస్థాపన

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి,మే 29 (విజన్ అంధ్ర)డ్చర్ల మండల పరిధిలోని బాదేపల్లి పాతబజార్ హరిజనవాడలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (వీఞూ) భవనానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, పాఠశాల భవన సమస్యను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం అరబిందో ఫార్మా యాజమాన్యంతో నిరంతరం చర్చలు జరిపి, వారి సామాజిక బాధ్యత (జూ=) నిధుల కింద నూతన పాఠశాల భవన నిర్మాణానికి ముందుకు తీసుకువచ్చినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి కార్పొరేట్ సంస్థ తమ లాభాల్లో రెండు శాతం నిధులను సామాజిక బాధ్యత కింద సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ గుర్తు చేశారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఈ నిధులను వినియోగిస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న అరబిందో ఫార్మా సంస్థ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి పునర్నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అరబిందో ఫార్మా సంస్థ రూ.4 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందులో భాగంగానే బాదేపల్లిలో రూ.80 లక్షల వ్యయంతో నూతన పాఠశాల భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆమోదంతో పాత భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణానికి



శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా ఉరుకొండ మండలం గుడిగానిపల్లిలో రూ.1.20 కోట్ల వ్యయంతో మరో నూతన పాఠశాల భవన నిర్మాణానికి కూడా అరబిందో ఫార్మా సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో అమ్నియల్, హెటరో ఫార్మా సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే భవిష్యత్తులో వారు కూడా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మండల విద్యాధికారి మంజులాదేవి, అరబిందో ఫార్మా కంపెనీ డి.జి .ఎం జనార్ధన్ రెడ్డి,అరబిందో ఫార్మా ఏ.జి.యం.(సి.ఎస్.ఆర్) ఆరుట్ల నరసింహా రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్..

### ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 29తెలంగాణ రాష్ట్రంలో ఒకవైపుఓవైపు ఎండలు, మరోవైపు వానలు, సూపర్ ఎల్నీనో అంటూ వస్తున్న వార్తలతోబిబిసతమతమవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది.బిఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించి ఐఎండీ ఈరోజు తన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంత కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది.ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌తో కూడిన మధ్య తెలంగాణ ప్రాంతాల్లో ఈసారి భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అటు ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య కోస్తా ప్రాంతాల్లో కూడా రుతుపవనాల ప్రభావం అనుకూలంగా ఉండనుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ వర్షాలు ఉభయ రాష్ట్రాల్లోని వ్యవసాయ రంగానికి, తాగునీరు, భూగర్భ జల వనరుల పునరుద్ధరణకు ఎంతో ఊరటనిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

దేశవ్యాప్తంగా 'సూపర్ ఎల్ నినో' ఆందోళన

తెలుగు రాష్ట్రాలకు సానుకూల అంచనాలు ఉన్నప్పటికీ, దేశవ్యాప్త పరిస్థితి మాత్రం కొంత ఆందోళనకరంగానే ఉండేలా కనిపిస్తున్నట్లు ఐఎండీ అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్ నినో' ) ప్రభావం కారణంగా దేశంలోని ఇతర ప్రాంతాలలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణ పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా, లభించే ప్రతి నీటి చుక్కను ఆచితూచి, పొదుపుగా వాడుకోవాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు

## మహిళా సాధికారతకు వేదికగా ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



( విజన్ ఆంధ్ర) మెదక్ బ్యూరో తెలంగాణలో మహిళా సాధికారతకు వేదికగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన. పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని. ధ్యాన్చంద్ చౌరస్తా ఏరియా దగ్గర ఉన్న గాంధీనగర్ ఏరియాలో నిర్మాణం తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులసంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈ.ఈ నరసింహులు తో కలిసి పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూజిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో మంజూరై ఇందిరాస్ మహిళా శక్తి భవనం నిర్మాణం చేపట్టి తుది దశకు చేరుకుందని ఇంకా మిగిలి ఉన్న పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని, మహిళల శిక్షణకు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనాన్ని ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణ ప్లాన్లు, గదుల నిర్మాణం, మౌలిక వసతుల పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు.

ఈ పరిశీలనలో పంచాయతీ రాజ్ ఈఈ నరసింహులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్వీస్ రికార్డులు, హెల్త్ కార్డు నమోదు గడువు జూన్ 30 వరకు పొడిగించాలి

### పీఆర్‌సీ అమలు, డీఏ బకాయిల విడుదల, ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలి

### ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర

బోడుప్పల్, మే 29 (విజన్ ఆంధ్ర): ఉపాధ్యాయులు, ఉద్యోగుల సర్వీస్ రికార్డుల ఆన్‌లైన్ నమోదు మరియు హెల్త్ కార్డుల నమోదు గడువును జూన్ 30 వరకు పొడిగించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యానం విజయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారంబోడుప్పల్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ రికార్డుల ఆన్‌లైన్ నమోదు గడువు మే 31తో ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు జనాభా గణన విధుల్లో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు సకాలంలో తమ సర్వీస్ రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం లేకపోయిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గడువును జూన్ 30 వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఉద్యోగులకు అందించే ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కార్డుల విషయంలో పూర్తి స్థాయి విధి విధానాలు రూపొందించి, వాటిపై స్పష్టత వచ్చిన తర్వాతనే ఉద్యోగుల వేతనాల నుంచి నగదు మినహాయింపులు చేపట్టాలని కోరారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉ



న్న పీఆర్‌సీ ను తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

### ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను ఏర్పాటు చేయాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సంయుక్తంగా పనిచేయాల్సిందిగా సూచించారు.తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున ఉదయం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణలో భాగంగా.. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాలు)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారుఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ ఏ ఓ యూనస్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు వరంగల్ జిల్లా విద్యార్థులు

హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 29 (విజన్ ఆంధ్ర)మే 30వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు ఒరిస్సాలో జరుగుతున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో వరంగల్ జిల్లాలోని మణి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు అండర్ - 69 లో కార్తీక్ పరిశి మరియు అండర్-54 గణేష్ పూసల తెలంగాణ రాష్ట్ర తరపున పాల్గొంటున్నరని ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ కోచ్ వరంగల్ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తెలిపారు. జాతీయస్థాయిలో వరంగల్ సత్తా చాటాలని కోచ్ మణికంట తో పాటు టీం మేనేజర్స్ ముదిగొండ సతీష్ తోపాటు తల్లిదండ్రులు స్నేహితులు తోటి విద్యార్థులు కార్తీక్, గణేష్ లకు శుభాకాంక్షలు తెలిపారు



## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా 'గంప శ్రీనివాస్' నియామకం

### నియామక పత్రాన్ని అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య నాయకుల హర్షం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 29తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకులు శ్రీ గంప శ్రీనివాస్ నియామకమయ్యారు. రోజున హైదరాబాద్ చింతల్ బస్తీలోని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో.మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారా గంప శ్రీనివాస్ గారికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, జిల్లా మాజీ అధ్యక్షులు అయిత రత్నాకర్, మంచాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, జిల్లా కోశాధికారి డా. మంకాల నవీన్ కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్యుల సేవలోఎల్లప్పుడూ ముందుంటారు: అమరవాదిలక్ష్మీనారాయణఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ గారు మాట్లాడుతూ... గంప శ్రీనివాస్ గారు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి, సమాజానికి అందిస్తున్న విశేష సేవలను కొనియాడారు. వైశ్యుల సంక్షేమం కోసం ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని, ఆయన



సేవలను గుర్తించే ఈ బాధ్యతాయుతమైన పదవిని అప్పగించినట్లు తెలిపారు. లిరాజకీయంగా, ఆర్థికంగా వైశ్యుల ఎదుగుదలకు కృషి చేస్తా: గంప శ్రీనివాస్తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ గారికి గంప శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత చదువులకు, స్వయం ఉపాధికి ఆర్థిక సహకారం అందించడానికి నా వంతు కృషి చేస్తాను. వైశ్యులు రాజకీయంగా ఎదగడం ఎంతో అవసరం. ఆయా పార్టీల ద్వారారాజకీయాల్లో పోటీ చేయడానికి ముందుకు వచ్చే వైశ్య నాయకులకు, వారి స్థాయికి తగ్గట్టు టికెట్లు ఇప్పించేలా రాష్ట్ర నాయకత్వంతో కలిసి ఒత్తిడి తెస్తాం.

లిబహుముఖ సేవకుడు.. గంప శ్రీనివాస్:ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గంప శ్రీనివాస్ గారు సమాజంలో వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు:వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులువైశ్య సంక్షేమ సమితిఉపాధ్యక్షులుడిస్ట్రిక్ట్ లేయర్ పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదగిరిగుట్ట ఆర్యవైశ్య సత్రం సహాయ కార్యదర్శికొమురవెల్లి ఆర్యవైశ్య సత్రం ముఖ్య సలహాదారులు సిద్దిపేట పాత వెంకటేశ్వర స్వామి దేవాలయం, బంగారు మైసమ్మ దేవాలయాల గౌరవ అధ్యక్షులుజిల్లా నాయకుల హర్షాతిరేకాలు:గంప శ్రీనివాస్ నియామకం పట్ల సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఆర్యవైశ్య నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, కోశాధికారి డా. మంకాల నవీన్ కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు యాసాల వెంకట్ లింగం, జిల్లా మహాసభ తక్షణ మాజీ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, రాష్ట్ర మహిళా విభాగం నాయకురాళ్లు మంకాల నాగరాణి, మాడిశెట్టి హేమలత, తడక లింగమూర్తి, మంచాల శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షులు మంకాల నగేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బ మాధవి, వాసవి సేవాదళ్ అధ్యక్షులు రవికంటి చంద్రశేఖర్ జిల్లా విభాగాల నాయకులు గంప కృష్ణమూర్తి, చింత రాజేంద్రప్రసాద్, పుల్లూరి శివకుమార్, అర్వపల్లి హరికిరన్, అయిత పురుషోత్తం, సోమ శివకుమార్ తదితరులు హర్షం తెలియజేశారు.

# అన్నారంలో అక్రమ మట్టి దందా...

### అనుమతులు బంధువులు, స్నేహితుల పేర్ల మీద మట్టి అమ్మకాలు వేరే రైతులకు
### పర్మీషన్ కొంతమేరకు...తవ్వకాలు ఇష్టానుసారం
### ఆఫీసర్ల పర్యవేక్షణ కరువుఅక్రమార్కునికి

వరంగల్ జిల్లా ప్రతినిధి మే27(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారంలో అక్రమ మట్టి దందా రోజురోజుకు మూడు పువ్వులు..ఆరుకాయలుగా విరాజిల్లుతుంది. దర్గా చెరువులో నల్ల రేగడి మట్టిని స్థానిక వార్డు మెంబర్ తన బంధువులు, స్నేహితుల పేర్ల మీద సంబంధిత ఆఫీసర్లతో పర్మీషన్ తీసుకుని వేరే రైతులకు రేగడిమట్టి కాకుండా మొరాన్ని తీస్తూ అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి జిల్లా ఆఫీసర్లతో సహా స్థానిక ఆఫీసర్ల అండదండలు ఉండడంతో అక్రమార్కుడు రెచ్చిపోతున్నాడు. సంబంధిత ఐబీ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయక పోవడంతో నల్లరేగడి మట్టి పర్మీషన్లు మొరం దందాకు



తెరలేపుతున్నాయి. లొకేషన్లో ఏ ఒక్క ఆఫీసరు ఉండక పోవడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్మీషన్ ప్రకారం...110 సర్వే నెంబర్ దర్గా శిఖం భూమిలో మాత్రమే మట్టిని చెరువుకట్టకు దూరంగా తీయాలి......ఇందులో నల్లరేగడి మట్టిని అనమతులు పొందిన రైతుల పొలాల్లో పోయాల్సి ఉంది. కాని ఇక్కడ ప్రైవేటు అవసరాలు, ఖాళీ ప్లాట్లలో, ఎఫ్టీఎల్ భూములలో , చుట్టుపక్కల గ్రామాల ఇటుక బట్టీలకు సైతం మట్టిని అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే తరలించాల్సి ఉండగా అర్ధరాత్రి వరకు మట్టిని తరలిస్తున్నే ఉన్నారు. మట్టి తోలే క్రమంలో స్థానిక రెవెన్యూ, పోలీస్ వారికి సమాచారం ఇచ్చి నిర్వహించుకోవాలి. అనుమతులు ఇచ్చిన 1000 క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ తీసుకోకుండా ...ఏ ఏ రోజు ఎంత పరిమాణం లో తీశారో ఇరిగేషన్ డిఈఈ నిర్ధారించాల్సి ఉంది. అనుమతులు ఇచ్చిన రోజులలో 1000క్యూబిక్ మీటర్లు ముందుగానే పూర్తి చేస్తే మట్టి తరలింపును ఆఫీసర్లు ఆపివేయాల్సి ఉంటుంది. అంతేకాక పర్మిషన్లు ఉన్న ట్రాక్టర్లే కాకుండా... ఎక్కువ ట్రాక్టర్లను పెట్టి మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మట్టి దందా పై పిర్యాదు చేసిన వారి వివరాలు ఆఫీసర్లు వెంటనే అక్రమార్కులకు చేరవేయడంతో వారిని సైతం బెదిరింపులకు గురిచేస్తూ...మేము ఆఫీసర్లకు...విలేకరులకు..మాములు ఇస్తున్నామని మమ్మల్ని ఎవరూ ఏమి చేయరని బాహటంగానే వారితో వాగ్వాదానికి దిగుతున్నరాని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఐబి ఆఫీసర్లు ఈనెల 26 నుంచి మట్టి తవ్వకాలకు పర్మిషన్ ఇస్తే ఈ అక్రమార్కులు ఈనెల 21 నుంచే ఇప్పటికీ వేల ట్రిప్పుల మట్టిని తరలించి అమ్ముకున్నారు. ఇప్పటికైనా మట్టి దందాను ఆపి అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ పర్యటన



భూపాలపల్లి జిల్లా : 29 మే ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి మండలంలోని గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్లతో కలిసి పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను పారదర్శకంగా కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది. అలాగే రానున్న రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వడ్ల లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, ఎగుమతులపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.

## రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్ జరగొద్దు

### నాణ్యమైన ధాన్యాన్నే మిల్లులకు తరలించాలి
### జూన్ 2 నాటికి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి
### కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మే-29(విజన్ ఆంధ్ర)రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో వరి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమాలు, కటింగ్లు జరిగితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులకు తరలించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 100 శాతం ట్యాబ్ ఎంట్రీలను పూర్తి చేయాలని సూచించారు. జూన్ 2 నాటికి అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళు పూర్తిచేసి కేంద్రాలను మూసివేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీవో కలిందిని, డీసీవో శ్రీమాల, ఏపీఎంలు, ఏ.పి.ఓ.లు ,సంబంధిత అధికారులు తదితరులు ,పాల్గొన్నారు.

## మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి మే27(విజన్ ఆంధ్ర);పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మహిళలు వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కార చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు తమ రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, పిల్లలకు చిన్నప్పటి నుంచే లింగ సమానత్వం, పరస్పర గౌరవం నేర్పించాలని అన్నారు. షీ టీం ప్రతినిధి సుజాత మాట్లాడుతూ మహిళలపై ఎక్కడైనా వేధింపులు జరిగినట్లయితే షీ టీంను 8712685142 నంబర్లో సంప్రదించాలని సూచించారు. అనంతరం షీ బాక్స్ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో ఫిర్యాదులు ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సంక్షేమ అధికారి మాట్లాడుతూ మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2013లో చట్టాన్ని అమలు చేసిందని తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో




ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీల ఏర్పాటు జరుగుతోందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు జిల్లా స్థాయి కార్యాలయాల్లో 59, మండల, గ్రామస్థాయి కార్యాలయాల్లో 59, ప్రైవేట్ సంస్థల్లో 26 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డీఎల్ఎస్ఏ అడ్వకేట్ సురేష్ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపుల కేసుల్లో గోప్యత పాటిస్తూ విచారణ చేపట్టాలని, ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలని వివరించారు. కమిటీలు ఏర్పాటు చేయని సంస్థలకు జరిమానాలు విధించే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చట్టానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేయడమైనది. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డిబిసిడిఓ పుష్పలత, డీఆర్డీఏ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులను కల్పించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గూడూరు, కమలాపూర్ లోని రెండు పడక గదుల ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 29 ( విజన్ ఆంధ్ర)రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ , తదితర మౌలిక వసతులను కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహుత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు, కమలాపూర్ లలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి మరమ్మతులు పనులు త్వరగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు త్వరగా పంపిణీ చేసే విధంగా మౌలిక వసతులను కల్పించాలని అన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గూడూరు, కమలాపూర్ సర్పంచ్ లు వనజ, సతీష్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, డిఆర్డీఓ మేన శ్రీను, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ సురేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతులు పంట మార్పిడి చేసుకోండి అధిక లాభాలు పొందండి

### తెలంగాణ సర్కార్ కేంద్రం సూచన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 29దేశంలో వరి ధాన్యం అధిక ఉత్పత్తి, నిల్వసమస్యలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలకమైన వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వరిని అత్యధికంగా పండిస్తున్న పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మరియు తెలంగాణ రాష్ట్రాల్లో వరి సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించాలని కేంద్రం సూచించింది. ఈప్రణాళికలో భాగంగా, తెలంగాణలో ప్రతి ఏటా 5 లక్షల ఎకరాల చొప్పున రాబోయే ఐదేళ్లలో మొత్తం 25 లక్షల ఎకరాల వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలని స్పష్టమైన లక్ష్యాన్ని (టార్గెట్) నిర్దేశించింది. ఇదే పంథాలో దేశవ్యాప్తంగా రాగల ఐదేళ్ల కాలంలో సుమారు 2.50 కోట్ల ఎకరాలలో వరి సాగును తగ్గించి, ఆయా భూములనుప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది వరి తగ్గింపునకు గల కారణాలు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టికేంద్ర ప్రభుత్వం ఈ తరహా నిర్ణయం తీసుకోవడానికి ప్రధానంగా మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది, అవసరానికి మించి దేశంలో వరి ఉత్పత్తి అవుతుండటంతో ఎఫ్సీఐ గోదాముల్లో నిల్వలు పేరుకుపోయి, నిర్వహణ భారం పెరిగిపోతోంది. రెండోది, వరి వైపే రైతులు మొగ్గు చూపడం వల్ల పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి ఇతర నిత్యావసర పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతోంది. దీనివల్ల దేశీయంగా ఇతర పంటల కొరత ఏర్పడి, విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ నేపథ్యంలోనే, భూగర్భజలాలపరిరక్షణతో పాటు పంటల మార్పిడి ద్వారారైతులకుఆర్థికస్థిరత్వంచేకూర్చడానికి, ఇతర వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలని కేంద్రం ఈ గైడ్లైన్స్ జారీ చేసింది.

## భారతదేశంలోనే ఏకైక ప్లాటినం -సర్టిఫైడ్ ఏక్మో సెంటర్గా యశోద హాస్పిటల్ గుర్తింపు

### యశోద హాస్పిటల్ క్రిటికల్ కేర్ క్లినికల్ డాక్టర్ సిద్దార్థ

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 29,(విజన్ ఆంధ్ర)భారతదేశంలోనే ఏకైక ప్లాటినం-సర్టిఫైడ్ ఏక్మో సెంటర్గా యశోద హాస్పిటల్ గుర్తింపు పొందిందని,గ్లోబల్ స్టాండర్డ్స్ కలిగిన ఎక్స్ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ (ఈ ఎల్ ఎస్ వో ) నుండి అత్యున్నత స్థాయి ప్లాటినం అవార్డు అందుకోవడం ద్వారా యశోద హాస్పిటల్స్ మరో అరుదైన ఘనత సాధించిందని యశోద హాస్పిటల్ క్రిటికల్ కేర్ వైద్యులు సిద్దార్థ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు సిద్దార్థ మాట్లాడుతు "ఈ ఎల్ ఎస్ వో ప్లాటినం గుర్తింపు మా పేషెంట్ భద్రత, క్లినికల్ ఎక్సలెన్స్ మరియు అంతర్జాతీయ ప్రమాణాల పట్ల నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఏక్మో వంటి అత్యంత క్లిష్టమైన లైఫ్ సపోర్ట్ థెరపీలను సమర్థంగా అందించగల సామర్థ్యాన్ని ఈ అవార్డు ధృవీకరిస్తోంది" అని తెలిపారు. ప్లాటినం-సర్టిఫైడ్ ఏక్మో సెంటర్గా యశోద హాస్పిటల్స్ వీ ఏ,వివి , ఈ సిపిఆర్ , అవేక్ ఏక్మో వంటి ఆధునిక సేవలను అందిస్తోందని, అనుభవజ్ఞులైన ఇంటెన్సివిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లు, ట్రాన్స్ప్లాంట్ నిపుణులు, స్పెషలైజ్డ్ ఐ సి యు నర్సుల బృందం ఈ సేవలకు మద్దతు ఇస్తోందన్నారు. అత్యాధునిక ఇక లు, అవయవ మార్పిడి సేవలు, ఏక్మో ఆధారిత చికిత్సలు, ఎయిర్ అంబులెన్స్ సౌకర్యాలతో దేశవ్యాప్తంగా మరియు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు అత్యవసర




వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయన్నారు. కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, ఎముక మజ్జ మార్పిడి సేవల్లో కూడా యశోద హాస్పిటల్స్ విశేష ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏక్మో , సీఆర్ ఆర్ టి అడ్వాన్స్డ్ వెంటిలేషన్, న్యూరో క్రిటికల్ కేర్ వంటి ఆధునిక సాంకేతికతలతో అత్యున్నత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. "ప్రపంచ స్థాయి ట్రాన్స్ప్లాంట్ కార్యక్రమాలు, ఏక్మో సేవలు, ఎయిర్ అంబులెన్స్ మద్దతుతో భారతదేశంలో అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోయే వైద్య ఫలితాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం" అని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ అసిస్టెంట్ మేనేజర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన ప్రతి గింజను కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### అకాల వర్షాలతో తడిసిన ధాన్యం: తక్షణమే కొనుగోలు చేయాలని దుబ్బాక మాల మహానాడు అధ్యక్షుడు డిమాండ్

విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ దుబ్బాక, మే 28:ఇటీవల రాత్రి వేళల్లో కురిసిన అకాల వర్షాలకు దుబ్బాక మండల వ్యాప్తంగా వరి, మొక్కజొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే పాడవుతుండటంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉంది. ఈ నేపథ్యంలో, దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని దుబ్బాక మాల మహానాడు అధ్యక్షుడు సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దుబ్బాకలో మీడియాతో మాట్లాడుతూ.. రైతులు ఎంతో కష్టపడి పండించిన వరి పంటను ప్రభుత్వం వెంటనే సేకరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం మండలంలో వరి కోతలు పూర్తయినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమార్కెట్ యార్డుల్లో కనీస సదుపాయాలు లేకపోవడం, కొనుగోలు ప్రక్రియలో విపరీతమైన ఆలస్యం జరగడం వల్ల రైతులు ఆర్థికంగా భారీగా నష్టపోతున్నారని సునీల్ కుమార్ విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, రైతులు పండించిన ప్రతి గింజనూ కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన కోరారు.రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో తగిన చర్యలు చేపట్టాలి. రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని
దుబ్బాక మాల మహానాడు అధ్యక్షుడు సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

### ఉప్పల్ లో ఉపాధి హామీ కూలీలతో క్షేత్రస్థాయిలో సౌకర్యాల గురించి ఆరా తీసిన కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 29 (విజన్ ఆంధ్ర): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ (ఈజీఎస్) పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులకు ప్రతిరోజు ఎంతమంది కూలీలు వస్తున్నారని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో క్షేత్రస్థాయిలో కల్పిస్తున్న సౌకర్యాలను గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఉపాధి హామీ పనులకు క్రమం తప్పకుండా వస్తున్నారా అని, మహిళలను స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నారా అని, రుణాలు తీసుకుంటే సకాలంలో కడుతున్నారా అని కలెక్టర్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈజీఎస్ పనులు చేస్తుండగా ఫోటోలు దిగే సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఫార్మ్ పాండ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధి హామీ పనులకు 480 మంది కూలీలు హాజరవ్వడంపై, ఉపాధి హామీ కూలీలకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేసిన తాగునీరు, టెంట్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, తదితర వసతులు కల్పించడం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు వేగంగా జరుగుతుండడం పై డిఆర్డిఓ మేన శ్రీను, కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు, ఈజీఎస్ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల్ గ్రామ సర్పంచ్ రమా, తహసిల్దార్ సురేష్ కుమార్, ఈజిఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 29,(విజన్ ఆంధ్ర ప్రతి నిధి): జిల్లాలోని మూ డు చింతలపల్లి మండలం కొల్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ది ఎం, సుగుణా బాయి,జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భిక్షం తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కొనుగోలు కేంద్రంలోని సౌకర్యాలను, ధాన్యం నాణ్యతను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకాలు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు, కేంద్రానికి ధాన్యం తెచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని, తూకం వేసే ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. తూకం పూర్తయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రైతులకు దక్కేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**-63,869 రైతుల నుండి 2,97,719.360 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**
**-45,458 రైతులకు. 490.87 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ**
**-35 కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు పూర్తి ముగించడం జరిగింది**
**రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి**
**-ధాన్యం రవాణాకు మరిన్ని అదనపు వాహనాలను కేటాయించాలి**
**-కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు, వాహనాలను సిద్ధంగా ఉంచాలి**
**-ఇసుక ట్రాక్టర్లను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలి**
**-కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి**
**-కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి**
**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరోశుక్రవారం, జిల్లా కలెక్టర్ క్యాంప్ ఆఫీసర్ హాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో లిజిల్లా కలెక్టర్లి మాట్లాడుతూ.. జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 63,869 రైతుల నుండి 2,97,719.360 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని



తెలిపారు45,458 రైతులకు. 490.87 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, 35 కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు పూర్తిచేసుకుని మూసివేయడం జరిగిందన్నారు.ధాన్యం రవాణాకు అదనంగా ట్రాక్టర్లు, లారీలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.ధాన్యం రవాణా, కొనుగోళ్ల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, ప్రతి కేంద్రంలో అవసరమైన వాహనాలు, హమాలీలు అందుబాటులో ఉంచి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు ఆలస్యం కాకుండా, ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. లక్ష్యాల వారీగా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

## 99 డేస్ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈసీడీ కార్యకలాపాల పరిశీలన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 29సిద్దిపేట జిల్లాలో99 డేస్ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ శుక్రవారం సిద్దిపేట జిల్లా అంబేద్కర్ నగర్ సెక్టార్ పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక బాల్య వికాసం (జుజణ) కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.అలాగే మిట్టపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె, కేంద్రంలో ఏర్పాటు చేసినబాలనేగిపెయింటింగ్స్, పిల్లల అభ్యాసానికి అనుకూలంగా రూపొందించిన విద్యా వాతావరణం, ఆటల ద్వారా నేర్చుకునే విధానాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల మెదడు వికాసం, ప్రీ-స్కూల్ విద్య, స్కూల్ రెడినెస్, మొదటి 1000 రోజుల ప్రాముఖ్యత, పోషకాహారం మరియు తల్లిదండ్రుల భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో 99 డేస్ ప్రజాపాలన కార్యక్రమం కింద ఈసీడీ కార్యకలాపాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఇండోర్ మరియు అవుట్‌డోర్ ఆటలు, కథలు, పాటలు, సృజనాత్మకకార్యకలాపాలు, స్కూల్ రెడినెస్ కార్యక్రమాలు, గర్భిణీలు మరియు బాలింతలకు అవగాహన కార్యక్రమాలు, ఎక్స్‌క్లూజివ్ బ్రెస్ట్‌ఫీడింగ్, కాంప్లిమెంటరీ ఫీడింగ్, రెస్పాన్సివ్ పేరెంటింగ్, ఎర్లీ స్టిమ్యులేషన్, హోమ్ విజిట్స్ మరియు చైల్డ్ ఫీడింగ్ డెమోన్స్ట్రేషన్లు నిర్వహించబడ్డాయి.
ఈ కార్యక్రమాలలో జిల్లా సంక్షేమ అధికారి శారద, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు చిన్నారుల సమగ్ర వికాసానికి దోహదపడేలా విజయవంతంగా సాగాయి.

# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

**రైతులకు ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించాలి**
**వడ్ల కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి**
**నర్సాపూర్‌లో రైస్ మిల్లులను పరిశీలించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**

విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో రైతుల నుంచి వడ్ల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ సూచించారు. శుక్రవారం నర్సాపూర్ ప్రాంతంలోని పలు రైస్ మిల్లులను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజువారీ వడ్ల స్వీకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని మిల్ యాజమాన్యాలకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వడ్ల నిల్వ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యం వల్ల రైతులు నష్టపోకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, లోడింగ్, అన్‌లోడింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిస్థితులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, రవాణా వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వెంట డియస్పి నరేందర్ గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎసై రంజిత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 29, విజన్ ఆంధ్రప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్ లతో కలిసి వందేమాతర గీతం ఆలపించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రజలకు అందించే పౌష్టిక ఆహారం, ప్రజల ఆరోగ్యంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ జిల్లా వైద్య పరంగా అభివృద్ధికి కృషి చేసి రోగులకు మెరుగైన సేవలు ఖండించాలని తెలిపారు. జిల్లాలో 464 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి జిల్లా అధికారులు ఒక్కొక్కరిని దత్తత తీసుకొని, నెలకు సరిపడా మందులు, పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. చాలామంది రోజు దగ్గు, పరువు తగ్గుదల, ఆరోగ్య క్షీణత పై బయటకు చెప్పకుండా లో లోపల మదన పడుతుంటారని, బయటకు చెబితే సమాజం చిన్నచూపు చూస్తారని ఎవరికీ చెప్పకుండా ఆందోళన చెంచుతుంటారని, అలాంటి వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి సరైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. చికిత్స అనంతరం క్షయ వ్యాధి నయం అవుతుందని, చికిత్సలు పొందాలని అవగాహన కల్పించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు, మత్తుకు బానికై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, నషా ముక్త్ భారత్ వైపు అడుగులు వేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని, స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సమాజంలో జరిగే అరాచకాలపై మౌనంగా ఉండొద్దని, ప్రజా వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ




అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, ఆకాంక్షిత జిల్లాలో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో శాఖల వారీగా చేపడుతున్న సేవలు, సంక్షేమ అభివృద్ధి పనులపై గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్.పి. నితికా పంత్ జిల్లాలో శాంతి భద్రతల పట్ల, మాదకద్రవ్యాల చర్యలపై వివరించారు.అంతకుముందు హెలికాప్టర్ ద్వారా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ కు జిల్లా కలెక్టర్, ఎస్.పి., జిల్లా అధికారులు స్వాగతం పలికిన అనంతరం రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకున్న కలెక్టర్ కు ధృవపత్రం ప్రధానం చేశారు. రాష్ట్ర గవర్నర్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి లకు జిల్లా అధికారులు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అసిఫాబాద్ జిల్లాకి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్

**పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్,**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే,29,విజన్ ఆంధ్రహెలికాప్టర్ ద్వారా కొమురం భీం జిల్లా కలెక్టరేట్ చేరుకున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కు పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ హరిత,ఎస్పీ నీతికా పంత్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండ విటల్,ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మిసిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు,అనంతరం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న గవర్నర్.

# విద్యార్థులనుచదువుతోపాటు క్రీడల్లో తీర్చిదిద్దండి

**విద్యార్థులకు గుణాత్మకమైన విద్యా అందించాలి**
**ఉపాధ్యాయసమస్యల పరిష్కారానికికృషి.**
**రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**
**నారాయణపేట జిల్లాలో విద్యారంగ అభివృద్ధికికృషిచేస్తా.**
**కలెక్టర్ సిహెచ్ ప్రియాంక.**

నారాయణపేట, మే 29 (విజన్ ఆంధ్ర)విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో తీర్చిదిద్దాలని రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిఅన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అల్పాహారము, కిట్టు విద్యార్థులకు అందజేయడం అభినందనీయం పి అర్ టి యు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి శుక్రవారం పి ఆర్టియుటిఎస్ నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2025 -26 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలోని ప్రభుత్వ అన్ని యాజమాన్యంలోని ప్రతి పాఠశాల మొదటి, రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఈ ఫలితాలు సాధించుటకు కృషిచేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందమును మెడల్స్,సర్టిఫికెట్, మెమొంటోలు లతో ఘనంగా జిల్లా కేంద్రంలోని అంజన గార్డెన్ లో పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులువై.జనార్దన్ రెడ్డి అధ్యక్షతన సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మన జిల్లా ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కృషితో విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. విద్యాశాఖ చాలా కీలకమైన శాఖ అని అందుకే ముఖ్యమంత్రి తన దగ్గరే ఆ శాఖను ఉంచుకొని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ఎప్పటికప్పుడు చేసేలా చూస్తున్నారని అన్నారు.




ఇప్పటికీ ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావలసిన పి.ఆర్.సి, డిఏలు, పెండింగ్ బిల్లులుల వంటి సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాను అన్నారు. విద్యార్థులు కలెక్టర్, డాక్టర్ అవుతాము అనడమే కాకుండా ఉపాధ్యాయుడుగా పనిచేస్తానని అనుకోవాలని అందుకు ప్రయత్నం చేయాలనీ,ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైనదని భవిష్యత్తు తరాలను తయారు చేస్తుందని కొనియాడారు. అదే విధంగా ఈ కార్యక్రమం చాలా అద్భుతమైనదని కితాబు ఇస్తూ జిల్లా కలెక్టర్ కు ర్ర్ పిఆర్టియు ఆధ్వర్యంలో అవార్డు పొందిన ఇద్దరు విద్యార్థుల ఫ్లెక్సీలను తయారుచేసి అన్ని పాఠశాలల్లో పెట్టాలని వాటిని స్ఫూర్తిగా తీసుకొని వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులు పిఆర్టియు అవార్డు తీసుకోవడానికి ఉత్సాహంతో చదివేలా ప్రేరణ కలిగించాలని సూచించారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాకు ప్రత్యేకంగా విద్యా వాలంటీర్లను తీసుకొని రావడానికి కృషి చేస్తానని అన్నారు.జిల్లా లో సాగునీటి కోసం చేపడుతున్న నిర్మాణాలలో రైతులకు ఇప్పటివరకు ఏ ప్రభుత్వ నివ్వని విధంగా ఆరు రెట్లు నష్టపరిహారము అందజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు జిల్లాలో విద్యార్థుల నమోదుకు మరియు గుణాత్మక విద్యకు ఉపాధ్యాయులు కృషి చేస్తూ ఉండాలని వారి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తాను అన్నారు జిల్లాలో అక్కడక్కడ బాల్యవివాహాలు జరుగుతున్నాయని వాటినరికట్టడానికి అందరూ సహకరించాలని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో నాలుగైదు పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధిస్తే కేవలం నేడు ఒక్క నారాయణపేట జిల్లాలోనే 38 పాఠశాలలు 100 శాతం సాధించారు. అభినందనీయమని, అదే విధంగా ప్రతి పాఠశాలలోని విద్యార్థులను ఉపాధ్యాయులను ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్న జిల్లా శాఖను అభినందిస్తూ పలు ఉపాధ్యాయ సమస్యల మీద మాట్లాడారు.ప్రత్యేకంగా తాను ఎమ్మెల్సీ అయినప్పటి నుండి 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల పాత పెన్షన్ సాధనకు మొట్టమొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు అతి త్వరలోనే అది సాకారం అవుతుందని అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రితో అతి సన్నిహితంగా ఉండే మంత్రి ఉద్యోగ ఉపాధ్యాయుల పిఆర్సి, డీఏలు పెండింగ్ బిల్లులు, త్వరగా వచ్చేటట్లు చూడాలని అందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర సంఘ అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ కిట్ వంటి సౌకర్యాలు అందజేస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా నారాయణపేట జిల్లా శాఖ జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్న కారణంగా విద్య వాలంటీర్స్ ఇవ్వాలని విద్యాశాఖ కార్యాలయానికి తగిన సిబ్బందిని కేటాయించాలని, కారుణ్య నియామకాలను చేపట్టాలని, హెల్త్ కార్డులు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరులో అమలు అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పేరి వెంకట్ రెడ్డి,ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేతా సత్య యాదవ్,జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజులు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఎం.నర్సింహా రెడ్డి,పి ఆర్ యు టి ఎస్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకట్ రెడ్డి గౌరవాధ్యక్షులు తిరుపతి మాజీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్ రావు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ జిల్లా సెక్టోరియల్ అధికారులు , విద్యాసాగర్ రాజేంద్ర కుమార్ నాగార్జున రెడ్డి శ్రీనివాసు జిల్లాలోని వివిధ మండలాల విద్యాధికారులు నిజాముద్దీన్ ఆంజనేయులు కృష్ణారెడ్డి అమీరొద్దీన్ జనార్దన్ రెడ్డి జిహెచ్ఎంలు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , వివిధ మండలాల పిఆర్టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏం రఘువీర్, జనార్ధన్, గోవర్ధన్, నరసింహారెడ్డి,రమేష్,భాస్కర్, సూర్యప్రకాష్, గోపాల్ రెడ్డి, బాబు, దండు శేఖర్, బలరాం,తిమ్మన్న,వెంకటేష్,హరీష్ ముస్తఫా, కిష్టయ్య,ప్రకాష్ గౌడ్, అనంతయ్య, శ్రీకాంత్,శ్రీనివాస్, భీమేష్ కార్యకర్తలు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ లో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 29 మేతెలంగాణలో, ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ జిల్లాలలో, సింగరేణి కాలరీస్ ద్వారా బొగ్గు తవ్వకం కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. దేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా అర్హత కలిగిన మైనింగ్ ఇంజనీర్లకు డిమాండ్ పెరుగుతోంది.అయితే, ప్రస్తుతం, ముఖ్యంగా ప్రభుత్వ సంస్థలలో బి.టెక్ (మైనింగ్ ఇంజనీరింగ్) చదవడానికి అవకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన చాలా మంది విద్యార్థులు, ఆసక్తి మరియు సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రైవేట్ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలలో అధిక ఫీజుల కారణంగా ఈ కోర్సునుచదవలేకపోతున్నారు.ఈ ప్రాంతం బొగ్గు గనుల ప్రాంతంలో ఉండటం మరియు గనుల పరిశ్రమలకు సమీపంలో ఉండటం వలన, శాతావాహన విశ్వవిద్యాలయం పరిధిలో హుస్నాబాద్ పట్టణంలో కొత్తగా స్థాపించబడిన ఈ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ (మైనింగ్ ఇంజనీరింగ్)ను ప్రవేశపెట్టడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.పై విషయాల దృష్ట్యా హుస్నాబాద్‌లోని శాతావాహన యూనివర్సిటీ కాలేజీలో బి.టెక్ (మైనింగ్ ఇంజనీరింగ్) కోర్సును ప్రవేశపెట్టడాన్ని, అలాగే అవసరమైన సిబ్బందిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్న

# కౌన్సిలర్ కాసర్ల పద్మ మృతి బాధాకరం

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కేటీఆర్**



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 29 (విజన్ ఆంధ్ర) :సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి కాసర్ల పద్మ అకాల మరణం తీవ్ర విషాదకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. టీ. రామ రావు పేర్కొన్నారు.గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందిన కాసర్ల పద్మ భౌతికకాయాన్ని సిరిసిల్లలోని ఆమె నివాసంలో సందర్శించి కేటీఆర్ శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పద్మ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## కొండపాక మండలం మిడిదొడ్డి ఆల్వాల్ గోదాంలోని చెత్తాచెదారం లేకుండా చేసి ధాన్యాన్ని దిగుమతి చేయాలని ఎమ్మార్వోలనుఆదేశించిన జిల్లా కలెక్టర్

సిద్దిపేటజిల్లా ప్రతినిధి మే 29సిద్దిపేట జిల్లాలో రైతులు ఇబ్బంది గురికాకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసేందుకు అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.శుక్రవారం దౌల్తాబాద్ మండలం రైతువేదిక వెనకాల గల సిడబ్ల్యుసి గోదాం, మిరుదొడ్డి మండలంలోని అల్వాల్ గ్రామంలో గల ఆధునిక మార్కెట్ కమిటీ గోదాం, కొండపాక మండల కేంద్రంలోనీ గోదాం లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతుందని వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం శాయశక్తిలా పనిచేస్తుందని తెలిపారు.మిల్లులలో స్థల కొరత కారణంగా దిగుమతి ఆలస్యం అవుతుందని ఈ సమస్యనుపరిష్కరించడానికి కొనుగోలు వేగవంతం చేయడానికి ఆయా మండలాల స్థానికంగా ఉన్న పలు గోదాం లను పరిశీలించడంజరుగుతుందని తెలిపారు.దౌల్తాబాద్ మండల కేంద్రంలో సిడబ్ల్యుసి గోదాంలో ఉన్న కొంత శనిగల ధాన్యంన్నీ పక్కన గల మక్కల గోదాములో మార్చేలా చర్యలు తీసుకోవాలినీ డి ఎం మార్కెటింగ్ నాగరాజు ను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ గోదాం మొత్తం వరి దిగుమతి అనుకూలమని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు అందరూకలిసిపనిచేయాలని సూచించారు.మీరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలోని గోదాం మీద రేకుల షిటింగ్ గ్యాబ్ లేకుండా చేస్తే గోదాంను ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి నీ ఆదేశించారు.కొండపాక మండల కేంద్రంలోని గోదాములో చెత్త చెదారం, లేకుండా శుభ్రం చేసి స్థానిక సెంటర్ ల నుండి వరి ధాన్యం దిగుమతి చేయించాలని స్థానిక తహసిల్దార్ మల్లికార్జున్నీఆదేశించారు.అకాల వర్షాల బారిన పడి ధాన్యం తడవకుండా, అలాగే కొనుగోలు సమస్యలు పరిష్కరిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని రైతుల పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు.

# ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ

## వాహనదారుల అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 29 (విజన్ ఆంధ్ర) : వరి కొనుగోలు వాహనదారుల అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటా చారి , జిల్లా అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం తరలింపులో ఎదురవుతున్న సమస్యలు, వాహనాల లభ్యత, రవాణా ఛార్జీలు, సమయపాలన తదితర అంశాలపై చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేసిన వరిని సరిపోవు వెహికిల్ లను ఏర్పాటు చేసి త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రవాణా ప్రక్రియలో సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని వెహికిల్ అసోసియేషన్ సభ్యులను కోరారు. ధాన్యం నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రాల్లో ఉండకుండా తక్షణమే తరలింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాండూర్, కొడంగల్ మండలాలలో వాహనాలను ఏర్పాటు చేసివరి కొనుగోలులో లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో తాండూర్ డి ఆర్ ఓ అనిత,డి ఆర్ డి ఓ శ్రీనివాస్,ట్రాన్స్ పోర్ట్ అధికారి సురేందర్ రెడ్డి, జి ఎం మహేశ్వర్,సివిల్ సప్లై అధికారులు మోహన్ కృష్ణ, సుదర్శన్, అధికారులు, మిల్లర్లు, వెహికిల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి
### స్వదేశీ కుక్క పిల్లల దత్తత కార్యక్రమానికీ శ్రీకారం






ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,మే 29,(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మహిళా సంఘ సభ్యులు,18 సంవత్సరాలు నిండిన అర్హులైన స్థానిక మహిళా ఓటర్లకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి గురువారంప్రారంభించారు. ఈ కార్యక్రమం మే 29 నుండి జూన్ 3 వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లలో సంబంధిత డివిజన్ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో చీరల పంపిణీ జరుగుతుంది. ప్రతి వార్డులో ప్రత్యేక పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వార్డ్ ఆఫీసర్లు,కార్పొరేటర్ల సమన్వయంతో అర్హులైన మహిళలకు చీరలను అందజేస్తారు. మహిళా సంఘ సభ్యులు,అర్హులైన మహిళా ఓటర్లు తమ వార్డు పంపిణీ కేంద్రాలకు వెళ్లి చీరలను స్వీకరించాలని అధికారులు కోరారు. మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మేయర్... ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ ద్వారా మహిళలకు ప్రత్యక్ష ప్రయోజనం కలగడంతో పాటు సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. మహిళా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పారదర్శకంగా పంపిణీ చేయాలి: కలెక్టర్... జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి మహిళకు చీర అందేలా పారదర్శకంగా పంపిణీ నిర్వహించాలని ఆదేశించారు. స్వదేశీ కుక్క పిల్లల దత్తత కార్యక్రమంఅనంతరం స్వదేశీ (ఇండీ) కుక్క పిల్లల దత్తత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వదేశీ జాతి కుక్కల సంరక్షణకు ప్రజలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దత్తత తీసుకున్న వారు కుక్క పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి, వాటి ఆరోగ్యం,పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ స్వదేశీ జాతి కుక్కల ప్రత్యేకతలు,వాటి సంరక్షణ,వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జూన్ 3 వరకు ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా చీరలను పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి మహిళ ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని కోరారు. స్వదేశీ జాతి కుక్కల దత్తత కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని,పశు సంక్షేమం, ప్రజారోగ్య పరిరక్షణ,నగర పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పిఎసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ జూకూరి రమేష్,కార్పొరేటర్లు ఆలకుంట్ల నాగరాజు,మామిడి కార్తీక్,పెరిక స్వాతి,గోగుల గణేష్,అల్లి సుభాష్ చంద్రబోస్,గుండెబోయిన పుష్పలత,కేసాని వేణుగోపాల్ రెడ్డి,అల్లి నాగలక్ష్మి మల్లికార్జున్,మేప్మా టీఎంసీ శ్రీనివాస్,కమ్యూనిటీ ఆర్గనైజర్లు అనిల్ కుమార్,జ్యోతి,రాజా, నరసింహ,ఆర్‌పీలు,మహిళా సంఘ సభ్యులు,మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
## కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మించి తెలంగాణలో ధాన్యం కొనుగోలు



ఖమ్మం జిల్లా బ్యూరో, మే 28(విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం బోనకల్ మండలం గార్లపాడు గ్రామంలో మోడల్ సోలార్ గ్రామాల పథకంలో భాగంగా వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన 7.5 కిలోవాట్ సోలార్ ప్లాంట్లను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క , ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్రంలో మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమం క్రింద రాష్ట్రంలో తొలి విడతలో 81 గ్రామాలను ఎంపిక చేసి ప్రతి గృహానికి 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లు, వ్యవసాయ మోటార్లకు 7.5 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లను మొత్తం 1380 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 27 గ్రామాల పరిధిలో 445 కోట్ల వ్యయంతో 16,837 గృహాలు, 4,371 వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా ద్వారా వ్యవసాయం, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని, తద్వారా రాష్ట్ర పురోగతి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. 2023-24లో రాష్ట్ర పీక్ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం అది 18,542 మెగావాట్లకు చేరుకుందని, కేవలం రెండున్నర సంవత్సరాల్లో 3 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ పెరిగినా ఎక్కడా చిన్న అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి ఉత్పత్తి పెంపు, అదనపు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టడం వల్ల విద్యుత్ గ్రిడ్ ఎక్కడా కుప్పకూలకుండా సరఫరా జరుగుతోందన్నారు. పీక్ డిమాండ్ ఎంత పెరిగినా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కారణంగా రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, అంచనాలకు మించి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా కొన్నిచోట్ల ధాన్యం తడిసినా ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9214 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని గుర్తించి చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు చేస్తామని, ఆ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకోకుండా ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు మార్లు కేంద్ర పౌరసరఫరాల మంత్రితో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కలిసి తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా స్వీకరించాలని కోరినా సానుకూల స్పందన రాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంలో భారత ఆహార సంస్థ కేవలం సగం మాత్రమే కొనుగోలు చేస్తోందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా భాజపా నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్ 2025-26లో కేంద్ర ప్రభుత్వం 60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఇవ్వగా తెలంగాణ ప్రభుత్వం 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. రబీ సీజన్‌లో కేంద్రం 51.60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, మరో 75 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిప్యూటీ సీఎం డిమాండ్ చేశారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేయడం వల్ల తెలంగాణ ప్రభుత్వం రైతులకు 17 వేల కోట్లు మద్దతు ధర కింద చెల్లించిందన్నారు. గత పాలకులు 2014 నుంచి 2023 వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, గత రెండున్నర సంవత్సరాల్లో తమ ప్రభుత్వం ఎంత కొనుగోలు చేసిందో లెక్కలతో సహా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, మహానేత వైఎస్సార్ ఈ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్నరకం వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ అందిస్తోందన్నారు. మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడం వల్ల ప్రతి రైతు 20 వేల నుంచి 25 వేల వరకు లాభపడ్డారని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, 2 లక్షల 67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించడం జరిగిందన్నారు. చింతకాని, ముదిగొండ, బోనకల్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కొంత మేరకు పెండింగ్‌లో ఉందని, మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలిపారు. ధాన్యం రవాణా కోసం ఎవరికి ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సీరియల్ నెంబర్ వారీగా లారీలను పంపిస్తూ రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసుకునే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ధాన్యం రవాణా కోసం డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రెడ్కో ఎండీ అనిల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ ఈ శ్రీనివాస చారి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్**
**జీలుగకు కిలో రూ.81.75, జనుముకు రూ.77.75 సబ్సిడీ,**
**నల్గొండలో విత్తన విక్రయ కేంద్రం ప్రారంభం.**



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,మే 29 విజన్ ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల అమ్మకం కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. జీలుగా విత్తనాలు కిలో ధర రూ. 163.50 కాగా, ప్రభుత్వం కిలోకు రూ. 81.75 సబ్సిడీ ఇస్తోంది. సబ్సిడీ పోను రైతు కిలోకు రూ. 81.75 చెల్లించాల్సి ఉంటుంది. 30 కిలోల బ్యాగు ధర రూ. 2,452.50. జనుము విత్తనాలు కిలో ధర రూ. 155.50 కాగా,ప్రభుత్వం కిలోకు రూ. 77.75 సబ్సిడీ ఇస్తోంది. రైతు చెల్లించాల్సింది కిలోకు రూ. 77.75. 40 కేజీల బ్యాగు ధర రూ. 3,110. పచ్చిరొట్ట వల్ల ప్రయోజనాలు.. పచ్చిరొట్ట ఎరువుల వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని,నేల గుల్లబారి సారవంతం అవుతుందని,భూసారం,నీటి నిల్వ శక్తి పెరిగి పంట దిగుబడి అధికమవుతుందని కలెక్టర్ వివరించారు. అందువల్ల రైతులు పచ్చిరొట్ట ఎరువులను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా జిల్లాకు 3,500 క్వింటాళ్ల జీలుగ,500 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయని,వీటిని జిల్లాలోని వివిధ మండలాలకు పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి,లక్ష్మయ్య,ఇతర ప్రజా ప్రతినిధులు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ వేడుకలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం

## జూన్ 2 వేడుకలను ఘనంగా నిర్వహించాలి
## అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు




రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 29 (విజన్ ఆంధ్ర):రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, సంబంధిత శాఖల అధికారులతో కలిసి శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో ప్రధాన వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. వేడుకల కోసం జెండా ఏర్పాటు, గ్రౌండ్ సిద్ధం, డయాస్ నిర్మాణం, సీటింగ్ ఏర్పాట్లు వంటి పనులను పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు సీటింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వేడుకల ప్రాంగణంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ మేరకు అందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్య అతిథి ప్రసంగానికి అవసరమైన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సంక్షిప్తంగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గౌరవ వందనం, భద్రతా ఏర్పాట్లు, ఇతర బందోబస్తు చర్యలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### రాష్ట్రంలో మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు
### ప్రజా పాలన కార్యక్రమంలో మెగా రుణాల మేళా
### చెక్కుల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 29 (విజన్ ఆంధ్ర):మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, ఉపాధి పథకాలను అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలకు మెగా బ్యాంక్ లింకేజ్ రుణాల మేళా శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 337 మహిళా సంఘాలకు రూ. 40 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు, 42 సంఘాలకు రూ. 1.05 కోట్ల ఎఫ్‌పీసీ, ఎఫ్‌పీజీ సీఐఎఫ్ రుణాలు, 278 సంఘాలకు రూ. 7.13 కోట్ల శ్రీనిధి రూరల్ రుణాలు, 55 సంఘాలకు రూ. 6.33 కోట్ల మెప్మా బ్యాంక్ లింకేజ్ రుణాలు, 61 సంఘాలకు రూ. 1.50 కోట్ల శ్రీనిధి మెప్మా రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాలకు రూ. 11.36 లక్షల కమిషన్ చెక్కులను అందజేశారు. కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్వయం ఉపాధి స్టాళ్లను ప్రభుత్వ విప్, కలెక్టర్ పరిశీలించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. రుణాలపై వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లించిందని పేర్కొన్నారు. ప్రతి మహిళ కోటీశ్వరురాలిగా ఎదగాలనే లక్ష్యంతో వివిధ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 60 శాతం మహిళా సంఘాలకే బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులు కేటాయించడం ద్వారా ప్రతి నెలా ఆదాయం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని, సిరిసిల్ల జిల్లాలో 37 వేల మందికి చీరలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూడమహిళా సంఘాలు తీసుకుంటున్న రుణాలను స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాల కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మహిళా సంఘాల ఎన్‌పీఏ తక్కువగా ఉండటం గర్వకారణమన్నారు. మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై వేధింపుల నివారణ, స్వయం సమృద్ధి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలను కాదని పెద్దలకు అప్పగిస్తారా...?

### -ఎన్నెస్పీ ఆక్రమణలను తొలగించకుంటే ఆందోళన ఉధృతం
### -గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు ఏమైంది...?
### -ఆక్రమణలను పరిశీలించిన సిపిఐ బృందం

ఖమ్మం జిల్లా బ్యూరో, మే 29 (విజన్ ఆంధ్ర) : నిలువ నీడ లేక ఎన్నెస్పీ కాలువ కట్టలపై గుడిసెలు వేసుకుంటే బలవంతంగా తొలగించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సంపన్నులు ఆక్రమిస్తే ఎందుకు నోరెత్తడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదలకు ఒక రీతి, సంపన్నులకు మరో రీతిగా చట్టంలో రాసి ఉందా అని అలా ఉంటే అధికారులు వెంటనే స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ స్థలాల ఆక్రమిత ప్రాంతాలలో -సిపిఐ బృందం పర్యటించింది. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రదేశాల్లో యధేచ్ఛగా నిర్మాణాలు జరుగుతుండటాన్ని పరిశీలించారు. అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, రాజకీయ నాయకులే ఈ ఆక్రమణ దారుల్లో ఉన్నారని సురేష్ తెలిపారు. పేదల గుడిసెలను తొలగించేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించి నిర్దాక్షిణ్యంగా ఎన్నెస్పీ కాలువ కట్టలపై పేదల గుడిసెలను తొలగింపజేసిన రాజకీయ -నాయకులే ఇప్పుడు స్థలాలను ఆక్రమించి షెడ్లు వేయడం శోచనీయమన్నారు. ఎన్నెస్పీ మేజర్ 2లో 66 అడుగుల వెడల్పున నాగార్జున సాగర్ కాలువ ఉన్నట్లు అధికారులు ధృవీకరించారని 12వ డివిజన్లో అష్టలక్ష్మి దేవాలయం ముందు భాగంలో ఓ వ్యాపారితో మొదలైన ఆక్రమణ గొల్లగూడెం రోడ్డు వెంబడి యధేచ్ఛగా సాగుతుందన్నారు. ఇప్పటికే కొందరు తమ నిర్మాణాలను పూర్తి చేయగా మరి కొందరు గతంలో ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్లను తొలగించి ఆక్రమణలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని సురేష్ తెలిపారు. కొందరు రాజకీయ నాయకులు ప్రోద్బలంతోనే ఇది జరుగుతుందని ఇందులో కొందరు కేవలం స్థలాల ఆక్రమణ కోసమే పార్టీలు మారారని సురేష్ -ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయకపోగా ఆక్రమణలను పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలను తొలగించకపోతే తిరిగి పేదల చేత ఈ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేస్తామని సురేష్ హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన కొందరి ప్రోద్బలమే ఈ ఆక్రమణలకు కారణమని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గుర్తెరిగి తగు చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. పరిశీలిన బృందంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి. రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సిపిఐ నాయకులు ఉపేందర్, నర్సింహారావు, సైదులు, మదూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించారు

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) మే 29. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పిఓ డిటిటి డాక్టర్ ఉమాశ్రీ తో కలిసి చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ఈ సందర్శనలో హాజరు రిజిస్టర్,అవుట్ పేషెంట్ రిజిస్టరు,ఎన్ సి డి రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్ ,పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ ను దాని రోజువారి టెంపరేచర్ రికార్డుల నమోదును పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్ పేషంట్లను పలకరిస్తూ వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు, సూచనలు ఇవ్వాలని,సిబ్బంది సమయపాలన పాటించాలని,గర్భవతుల చెకప్స్ ,అభా కార్డుల క్రియేషన్ సంఖ్యను పెంచాలన్నారు 13 సం,,ల వయస్సు పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసిన అందరిని రీస్క్రీనింగ్ చేస్తూ ఫాలోఅప్ చేయాలన్నారు. 14 సంవత్సరము నిండిన బాలికలకు హ్యూమ వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీ కీర్తన మరియు సంబంధిత వైద్య సిబ్బంది ఉన్నారు.

# యువత వ్యాపార రంగంలోకి రావాలి

**జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

**ఎస్సీ,ఎస్టీ హబ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట మే 29 (విజన్ ఆంధ్ర)యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. జాతీయ ఎస్సీ,ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ,ఎస్టీ వ్యాపారవేత్తల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.జిల్లా అభివృద్ధి చెందాలంటే యువత పారిశ్రామిక రంగంలో రాణించాలని, రాష్ట్ర,దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు,ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు రావాలని కోరారు.వ్యాపార కేంద్రాలు, పరిశ్రమలు ఎలా ఏర్పాటు చేసుకోవాలి,వ్యాపార నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటనే అంశాలపై చాలా మంది యువతకు సరైన అవగాహన లేదని పేర్కొన్నారు.అలాంటి వారికి మార్గనిర్దేశం చేయడంలో మిక్కి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు.విజయం సాధించిన పారిశ్రామిక వేత్తల అనుభవాల నుంచి స్ఫూర్తి పొందడంతో పాటు,వ్యాపారంలో ఎదురైన వైఫల్యాల నుంచి కూడా గుణపాఠాలుగా నేర్చుకోవాలని సూచించారు.యువతలో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించి వారిని సమర్థవంతమైన వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలు సమాజ అభివృద్ధికి దోహద పడతాయని అన్నారు.పరిశ్రమల స్థాపనలో అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. నిబద్ధత,కృషి, సంకల్పం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని యువతకు సందేశం ఇచ్చారు.ఈ సదస్సులో మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షులు తక్కిళ్ళ విప్లవగాంధీ,ఎన్ఎస్ఎస్ హెచ్ఓ ఇంచార్జి ఎస్.సురేష్,ఎన్ఎండిసి డిజిఎం హరి కిషన్,డిఐసి అడిషనల్ డైరెక్టర్ శోభారాణి,టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్,ప్రచార కార్యదర్శి ఉమాపతి,కోశాధికారి శ్రీనివాస రాజు, జిల్లా సమన్వయ కర్త పడిదల శంకర్, డైరెక్టర్ దుబ్బా నాగేశ్వర్,మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత,నాగేంద్ర గౌడ్, రవివర్మ,పడిదల జానకిరామ్, నమోనా గ్లోబల్ వెంచర్ ఫౌండర్ బొడ్డు రిషి,ఎస్సీ,ఎస్టీ పారిశ్రామిక వేత్తలు,యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

**జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**ఇందిరమ్మ చీరల పంపిణీ,**

**64 మందికి కుక్క పిల్లల దత్తత**



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,మే 29,(విజన్ ఆంధ్ర)ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని,వీటన్నిటినీ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.64 మందికి కుక్క పిల్లల దత్తత..ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 64 కుక్కల ప్రేమికులకు కుక్క పిల్లలను దత్తత ఇచ్చారు.కుక్క పిల్లల దత్తతపై కలెక్టర్ మాట్లాడుతూ జంతువుల్లో కుక్క అత్యంత విశ్వాసమైనదని అన్నారు.వీటిని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.అదే సమయంలో రానున్న వానా కాలంలో కుక్కకాట్లు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, కుక్కకాట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.వీధుల్లో ఎక్కడపడితే అక్కడ ఆహార పదార్థాలు,చెత్తాచెదారం వేయడం వల్ల ఆహారం కోసం కుక్కలు రోడ్లపైకి,కాలనీల్లోకి వస్తాయని,అదే సమయంలో చిన్నపిల్లలు,పాఠశాల విద్యార్థులు కుక్కకాటుకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.దీనిని దృష్టిలో ఉంచుకొని వీధుల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.నల్గొండ జిల్లాలో జంతు జనన నియంత్రణ కేంద్రం ఉన్నందున ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.కుక్కలను ఇంట్లోనే పెంచుకోవాలి:మేయర్.. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుక్కలను దత్తతగా పొందినవారు వాటిని కాపాడుకోవాలని,వీధిలోకి వదలకుండా ఇంట్లోనే పెంచుకోవాలని,సమయానికి వాటికి ఆహారం అందిస్తూ చక్కగా పెంచుకోవాలని సూచించారు.ప్రజలు కుక్కల పట్ల అవగాహన పెంచుకోవాలని,కుక్క కాటుకు గురికాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్,కార్పొరేటర్లు తదితరులు హాజరయ్యారు.

# వరి కొయ్యలను కాల్చవద్దు: పర్యావరణాన్ని కాపాడండి

**కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**కొయ్యలు కాల్చితే భూసారం దెబ్బతింటుంది**

**ప్రాణాపాయం, కేసులూ తప్పవు:**

**ఎస్పీ.శరత్ చంద్ర పవార్**



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, మే 29,(విజన్ ఆంధ్ర) రైతులు వరి పంట కోసిన తర్వాత పొలంలో ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని,అందువల్ల ఎవరూ వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని గిరక బావి గూడెంలో రైతులు వరి కొయ్యలను పొలంపైనే తగలబెడుతున్నారని తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు.వరికొయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని,ఆ తర్వాత దుక్కి దున్నినా నేల గుల్లబారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు.భూసారాన్ని పెంచుకునేందుకు అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని,ఆ భారం కూడా రైతులపైనే పడుతుందని వివరించారు.వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు రహదారులపై వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడతాయని,పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు,పరికరాలు తగలబడే అవకాశం ఉందని హెచ్చరించారు.ఇటీవల కాలంలో జిల్లాలో వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల ప్రాణాపాయం సంభవించిన ఘటనలను గుర్తు చేశారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కొయ్యలను తగలబెట్టవద్దని కోరారు.రైతులకు వరికొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.కేసులు నమోదు చేస్తాం... ఎస్పీజిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలంపైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా భూములు సారవంతం కోల్పోతాయని,అందువల్ల ఎవరూ తగలబెట్టవద్దని చెప్పారు.ఎవరైనా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాలు సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.కలెక్టర్,ఎస్పీ వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**అన్‌లోడింగ్, రవాణా ప్రక్రియలో**

**జాప్యం ఉండొద్దు**

**అధికారులతో టెలీ కాన్ఫరెన్స్**

**నిర్వహించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల బ్యూరో , మే 29 (విజన్ ఆంధ్ర):జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.ధాన్యం సేకరణ, అన్‌లోడింగ్, రవాణా, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా, రవాణా శాఖల అధికారులతో కలెక్టర్ శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షాల ప్రభావంతో ధాన్యం తడవకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే భరోసాను రైతులకు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ధాన్యం సేకరణలో మరింత వేగం పెంచడంతో పాటు అన్‌లోడింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. అపరల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో ఉన్న హమాలీలను అవసరమైన ప్రాంతాలకు తరలించి అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దీని ద్వారా వాహనాలను త్వరగా ఖాళీ చేసి ఇతర కేంద్రాలకు పంపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని అధికారులకు తెలిపారు.రవాణా వాహనాల కొరత తలెత్తకుండా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తుది దశలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు అదనపు వాహనాలు కేటాయించి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# తడిసిన ధాన్యంపై రైతులు ఆందోళన చెందవద్దు

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా**

**చర్యలు తీసుకుంటున్నాం**

**జిల్లాలో ఇప్పటికే 80 శాతం ధాన్యం**

**కొనుగోలు పూర్తి**

**అంకుసాపూర్ కొనుగోలు కేంద్రాన్ని**

**పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



తంగళ్లపల్లి రాజన్న బ్యూరో, మే 29 (విజన్ ఆంధ్ర):వర్షాల కారణంగా తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కేంద్రంలో సేకరించిన ధాన్యం, తూకం వేసి తరలింపుకు సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సీజన్‌లో వరి దిగుబడి అధికంగా రావడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక కూడా పెరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మొత్తం కొనుగోళ్లలో 80 శాతం పూర్తి అయినట్లు వెల్లడించారు.డీఆర్డీఓ, సహకార, మెప్మా, పౌర సరఫరాలు, రవాణా తదితర శాఖల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, గోదాములు, అపరల్ పార్క్‌లలో అన్‌లోడింగ్ వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియను సమీక్షిస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో కురిసిన వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.అపరల్ పార్క్‌లు, గోదాముల వద్ద అన్‌లోడింగ్ పనులు కొనసాగుతున్నాయని, హమాలీలకు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను త్వరగా తరలించేందుకు సరిపడా వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు సూచించినట్లు తెలిపారు.అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, వీలైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు.రిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరగాలి

**గంజాయి హాట్‌స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా**

**మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై**

**కఠిన చర్యలు**

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో**

**అధికారులకు ఎస్పీ ఆదేశాలు**






కొత్తగూడెం బ్యూరో మే 29(విజన్ ఆంధ్ర)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా పోలీస్ అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందే విధంగా పనిచేయాలని ఆదేశించారు.కేసుల విచారణలో నిర్లక్ష్యం, జాప్యం అసలు సహించబోమని హెచ్చరించిన ఎస్పీ, పోలీస్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.జిల్లాలో పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, జిల్లా వ్యాప్తంగా గంజాయి హాట్‌స్పాట్స్‌ను గుర్తించి రవాణా చేసే వారితో పాటు వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనుమానితులకు గంజాయి రాపిడ్ టెస్ట్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ వచ్చినట్లయితే కేసులు నమోదు చేయా సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, సైబర్ మోసాలకు గురైన బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు.డయల్-100 కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని, పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా పనిచేయాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు నిరంతర వాహన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డి ఎస్ పి ఆదినారాయణ, సతీష్ కుమార్, రవీందర్ రెడ్డి, వెంకన్న బాబు, మల్లయ్య స్వామి, అరుణ్ కుమార్తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మిడ్ మానేరు జలాశయంలో మోస్తరు నీటి నిల్వలు

**జలమట్టం 307.17 మీటర్లుగా నమోదు**

**ప్రస్తుతం 7.576 టీఎంసీల నీటి నిల్వ**

**బోయినపల్లి రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 29**



(విజన్ ఆంధ్ర):బోయినపల్లి మండలం కొదురుపాక వద్దనున్న మిడ్ మానేరు జలాశయంలో ప్రస్తుతం మోస్తరు స్థాయిలో నీటి నిల్వలు కొనసాగుతున్నాయి.శుక్రవారం ఉదయం 6 గంటలకు విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం జలాశయంలో నీటి మట్టం 307.17 మీటర్లుగా నమోదైంది. పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లు కాగా, మొత్తం 27.55 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 7.576 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.జలాశయానికి ప్రస్తుతం ఎలాంటి ఇన్‌ఫ్లోలు రావడం లేదని తెలిపారు. ఎస్వైపీ, ఎస్సారెస్పీ, మానేరు, ములవాగు, ఎఫ్ఎఫ్సీ ఇన్‌లెట్ల నుంచి నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయినట్లు పేర్కొన్నారు.మరోవైపు జలాశయం నుంచి మొత్తం 140 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోందని అధికారులు తెలిపారు. ఇందులో 95 క్యూసెక్కులు ఆవిరి రూపంలో, మరో 45 క్యూసెక్కులు ఎంబీ ద్వారా వినియోగంలోకి వెళ్తున్నట్లు వెల్లడించారు.కుడి ప్రధాన కాలువ, ఎడమ ప్రధాన కాలువ, ప్యాకేజీ-9, ప్యాకేజీ-10, జీసీఎల్ఎస్ మార్గాల ద్వారా ప్రస్తుతం ఎలాంటి నీటి విడుదల జరగడం లేదని స్పష్టం చేశారు. అలాగే స్పిల్‌వే గేట్లు, రెగ్యులేటర్ గేట్లు మూసివేసే ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకం

**గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు**

**ప్రభుత్వం ప్రత్యేక సేవలు అందిస్తోంది**

**శత్రాజ్‌పల్లిలో నూతన అంగన్వాడీ కేంద్రాన్ని**

**ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



వేములవాడ రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 29 (విజన్ ఆంధ్ర):చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలతో పాటు విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం వేములవాడ పట్టణంలోని శత్రాజ్‌పల్లిలో నూతన అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికతో ప్రతి వారం ఒక్కో శాఖ ఆధ్వర్యంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ వ్యవస్థ ఎంతో అవసరమని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య, విద్యా సేవలను మరింత బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.పసిపిల్లల్లో పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పక్కా భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు మంజూరు లభించిందని తెలిపారు. రూ.200 కోట్ల వ్యయంతో 20 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థలో నాణ్యమైన విద్య, భోజనం అందించనున్నట్లు చెప్పారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు కూడా త్వరలో అందుబాటులోకి వస్తాయని, ప్రతి నియోజకవర్గానికి ఒక స్కూల్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ఆసుపత్రుల్లో 36 వేల పడకలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాల కోసం వేములవాడ నియోజకవర్గంలోని మర్రిపల్లి గ్రామంలో 40 ఎకరాల్లో రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆధునిక వ్యవసాయ విధానాలు, కొత్త వంగడాలపై రైతులకు అవగాహన కల్పించేలా ఈ కేంద్రం పనిచేస్తుందని పేర్కొన్నారు. శత్రాజ్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# జూన్ 5న ఇందిరాపార్క్ మహాధర్నా ను విజయవంతం చేయండి

**-టీజీఎస్ఈసీ సిద్దిపేట జిల్లా శాఖ పిలుపు**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మే 29:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా ప్రైవేటీకరణ,కార్పొరేటీకరణ విధానాలకువ్యతిరేకంగా జూన్ 5న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ర్యాలీ, మహాధర్నా నిర్వ హిస్తున్నట్లు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు లింగారెడ్డి ప్రకటించారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో విద్యా పరిరక్షణ కమిటి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సుంచు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కిష్టయ్య లతో ధర్నా పోస్టర్లు, కరపత్రా లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యా పరిరక్షణ కమిటి నాయకులు గాడిపల్లి తిరుపతి రెడ్డి, విజయేందర్ రెడ్డి, కిష్టయ్య, తిరుపతి రెడ్డి, కనకయ్య, శ్రీకాంత్ తదితరులులుమాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల విద్యారంగం సంక్షోభంలోకి వెళుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు



విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం 2020 రాష్ట్రంలో అమలు చేయవద్దని కోరారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల స్థాపనను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ బాధ్యులు తిరుపతి, శ్రీనివాస్, కనకయ్య,శ్రీనివాస్, డీటీఎఫ్ బాధ్యులు రాజిరెడ్డి, చంద్రబాను, ప్రభాకర్‌రెడ్డి,ఇంద్రసేనారెడ్డి మల్లయ్యసత్యనారాయణ, సత్తయ్య,నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభం పై భారత్ గెలుపు..!!

- 7.3% వృద్ధితో సరికొత్త రికార్డు
- ప్రపంచం వణికినా.. భారత్ తొణకదు
- ప్రగతి పథంలో నవ భారతం
- ఆర్థిక తుఫానులోనూ చెక్కుచెదరని విశ్వాసం
- మోదీ మార్క్ తో భారత్ అద్భుత ప్రస్థానం
- దేశీయ గిరాకీ, వ్యవసాయం, సేవా రంగాల పటిష్టత
- కోట్లాది భారతీయుల ఆకాంక్షలకు ఆర్థిక ప్రగతి నిదర్శనం
- ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న ప్రపంచ దేశాలు..
- ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్న భారత ఆర్థిక వ్యవస్థ

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, మే 29 (విజన్ ఆంధ్ర) :** :ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు, సవాళ్లు వెంటాడుతున్నప్పటికీ, భారత్ మాత్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల వెలువడిన గణాంకాల ప్రకారం, దేశం త్రైమాసికంలో 7.3% ఆర్థిక వృద్ధిని సాధించి, సంక్షోభాన్ని తట్టుకొని బలంగా నిలబడింది. ఈ అసాధారణ ప్రగతి దేశీయ గిరాకీ, వ్యవసాయం, సేవా రంగాల పటిష్టతకు నిదర్శనం. ప్రపంచ మార్కెట్లు మాంద్యం భయాలతో వణికిపోతున్న వేళ, చమురు సంక్షోభం, ద్రవ్యోల్బణం వంటి పెను సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, భారత్ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, వేగంగా ముందుకు సాగుతోంది. ఇది కేవలం సంఖ్యల గారడీ కాదు, కోట్లాది మంది భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, కష్టానికి ప్రతీక. రైతన్నల శ్రమ, పరిశ్రమల పురోగతి, సేవా రంగాల విస్తరణ ఈ వృద్ధికి వెన్నెముకగా నిలిచాయి.

ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, దేశీయ గిరాకీ ఊపందుకోవడంతో ఆర్థిక చక్రం మరింత వేగంగా తిరుగుతోంది. ఒకప్పుడు సాధారణ పరిస్థితుల్లోనూ దేశాన్ని అంధకారంలోకి నెట్టిన పాలనను చూసిన భారత్, నేడు ప్రపంచ సంక్షోభంలోనూ వృద్ధి పథంలో దూసుకుపోవడం




విశేషం. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, పటిష్టమైన ఆర్థిక విధానాలు ఈ అద్భుత ప్రగతికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సవాళ్లను అవకాశాలుగా మలుచుకుంటూ, దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న మోదీ పాలన, గత పాలకుల నిర్లక్ష్యానికి పూర్తి భిన్నంగా నిలుస్తోంది. ఈ వృద్ధి కేవలం ఆర్థిక సంఖ్యలకే పరిమితం కాదు. ఇది ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న నవ భారతానికి ప్రతీక. ప్రతి భారతీయుడి ముఖంలో చిరునవ్వును చూసేందుకు, దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు జరుగుతున్న నిరంతర కృషికి ఇది నిదర్శనం. సంక్షోభాలను అధిగమించి, సుస్థిర వృద్ధిని సాధిస్తున్న భారత్ ప్రస్థానం, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుంది అనడంలో సందేహం లేదు.







## అన్నదానమే మహాదానం

### అన్నార్తులకు అన్నదానంతో పాటు వాటర్ బాటిల్స్ పంపిణీ

### మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం

వేములవాడ, మే 29 (విజన్ ఆంధ్ర):"అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న" అనే స్ఫూర్తితో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమం మరోసారి



ఆకట్టుకుంది.దాతల సహకారంతో గత 1865 రోజులుగా నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లక్ష్మీగణపతి ఆలయం, రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద సుమారు 50 మంది అన్నార్తులకు, పేదలకు అన్నదానం నిర్వహించడంతో పాటు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.ఈ రోజు అన్నదాతలుగా కీ శే శ్రీ చింతలాతాడేం మైసయ్య 2వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు కుమారుని పుట్టినరోజు సందర్భంగా తమ్మల భీమన్న - నర్మద దంపతులు, వివాహ వార్షికోత్సవం సందర్భంగా కరీంనగర్‌కు చెందిన గున్నాల రాములు - పద్మ దంపతులు, , జువ్వాజి బాలమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.అలాగే డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు - స్నేహలత దంపతులు, ప్రతాప్ - స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ - జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ - సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ - బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు ప్రజ్ఞ - శరత్ చంద్ర, శిరీష - సాయిచంద్ర, శర్వాణి - రవిచంద్ర దంపతులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణలు కూడా సహకరించారు.పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, వర్ధంతులు తదితర సందర్భాల్లో పేదలకు అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్ట్ సభ్యులను లేదా 92469 39388 నంబర్‌ను సంప్రదించాలని ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ కోరారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, వొద్యాల వేణు, పసుల శ్రీనివాస్, మఠం శివకుమార్, రాజూరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో మావోయిస్టుల ఆయుధ కేంద్రం ధ్వంసం

**- గడ్చిరోలి, నారాయణపూర్ పోలీసుల ఉమ్మడి ఆపరేషన్**

**- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం**

చర్ల, మే 29 (విజన్ ఆంధ్ర): తెలంగాణ,ఛత్తీస్‌గఢ్ , మహారాష్ట్ర సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా బలగాలు విజయవంతంగా ధ్వంసం చేశాయి. గడ్చిరోలి జిల్లా పోలీసులు, ఛత్తీస్‌గఢ్‌కు





చెందిన నారాయణపూర్ పోలీసులు లొంగిపోయిన మావోయిస్టుల సమాచారం ఆధారంగా గురువారం ఈ సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు, గడ్చిరోలి ఎస్పీ ఎం. రమేష్ పర్యవేక్షణలో మే 26న ప్రారంభమైన ఈ ఆపరేషన్‌లో ప్రత్యేక దళాలు, డీఆర్‌జీ బృందాలు, బాంబు నిర్వీర్య దళాలు పాల్గొన్నాయి,నారాయణపూర్ జిల్లా కాకూర్ పరిధిలోని అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా, భూగర్భంలో దాచిన భారీ ఆయుధ సంపత్తి బయటపడింది ,శుక్రవారం కూడా సోదాలు నిర్వహించారు

స్వాధీనం చేసుకున్న సామగ్రి

పోలీసులు ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, రెండు 12 బోర్ రైఫిళు ,, 25 కిలోల ఐఈడీ పేలుడు పదార్థం, రెండు క్లేమోర్లు, 110 డెటోనేటర్లు, బీజీఎల్ లాంచర్లు, లేథ్ మిషన్లు, గ్రైండర్లు, సోలార్ ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు, ఆయుధ తయారీ సామగ్రిని భద్రతా దళాలు సంఘటన స్థలంలోనే ధ్వంసం చేశాయి, ఈ ఆపరేషన్ ద్వారా మావోయిస్టుల కార్యకలాపాలకు పెద్ద దెబ్బ తగిలిందని పోలీసులు వెల్లడించారు.

## అమ్మో.. ఈ నీటిని ఎలా తాగేది...

- ఫ్యాక్టరీల వ్యర్థాలతో భూ గర్భ జలాలు కలుషితం
- ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యమే..
- న్యాయం కోసం కాలనీ వాసుల మొర



బోడుప్పల్,మే29(విజన్ ఆంధ్ర ప్రతినిధి):: కోట్ల రూపాయలు వెచ్చించి ఇండ్లు కొనుక్కుంటే తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాము... ఇంట్లో ఉన్న బోరు వాడుకుందామంటే చుట్టూ పక్కన ఉన్న భూ గర్భ జలాలు కలుషితం కావడంతో వాడుకోవడానికి కూడా ఇబ్బందికరంగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ లోని తిరుమల మెడోస్ కాలనీ వాసులు వాపోతున్నారు.శుక్రవారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కు పిర్యాదు చేయడానికి వచ్చిన కాలనీ వాసులు మీడియాతో మాట్లాడుతూ నాడు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బోడుప్పల్ నగరంలో ఇళ్ళు తీసుకుంటే హైదరాబాదు నగరానికి అనుకూలంగా ఉంటుందని భావించం కానీ నేడు అక్కడి పరిస్థితులను చూస్తే ఎందుకు ఇక్కడ ఇళ్ళు కొనుగోలు చేశామా అని బాధపడుతున్నామని వాపోయారు. ఇండ్ల చుట్టూ కంపెనీలు అ కంపెనీల నుండి వచ్చే విష వాయువులను పీల్చడం ద్వారా రోగాలు వస్తున్నాయి అంతే కాదు పలు కంపెనీలు ఎస్టీపీలు ఏర్పాటు చేసుకోకపోవడం వలన డ్రైనేజీ వాటర్ ను విచ్చలవిడిగా వదలడంతో భూ గర్భ జలాలు కలుషితం కావాడం జరిగింది దాంతో బోరు వాటర్ విపరీతమైన దుర్వాసన, రంగు మారి వస్తున్నాయి దీనిపై గత రెండు సంవత్సరాల నుండి అధికారులకు ఫిర్యాదు చేస్తున్న నీటి సంపులు పూర్తిగా కలుషిత నీటితో నిండిపోయాయని చెప్పారు. నల్లాల్లో కలుషిత మంచినీరు వస్తుందని సంబంధిత వాటర్‌వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ నీటిని ఎలా తాగేదని ప్రశ్నిస్తున్నారు. పది రోజులైనా పట్టించుకోరా? అని ఫైర్ అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరించాలని కాలనికి చెందిన మహిళలు సరితా,బాగ్య,కవితా, బాగ్య,లక్ష్మీ లు వాపోయారు.

**ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లే..**

ఈ ప్రాంతంలో కలుషిత జలాలు సరఫరా అవుతున్నా స్థానిక డివిజన్ అధికారులు పట్టించుకోవడం లేదు.గతంలో డ్రైనేజీ లైన్ నిండితే తాగునీరు కలుషితంగా వచ్చేది. కానీ ప్రస్తుతం డ్రైనేజీ లైన్ నిండకపోయినా కలుషిత నీరు వస్తోంది. మొదటి పది నిమిషాల పాటు నీరు పట్టుకోలేక వదిలేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక వాటర్‌బోర్డు అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలో తాగునీటి పైపులైన్ కూడా ఐదారేళ్ల క్రితమే ఏర్పాటు చేశారు. కలుషిత జలాలు సరఫరా కావడానికి కారణాలను కనీసం తెలుసుకోవడం లేదు. సమస్య పరిష్కారం చేయడం లేదు. కలుషిత జలాలు తాగి ఇండోర్, భోలక్‌పూర్ లాంటి ఘటనలు తలెత్తితేనే వాటర్‌బోర్డు అధికారులు మేలుకుంటారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజల డిమాండ్లు:**

కలుషిత నీటి సమస్యపై వెంటనే విచారణ చేపట్టాలి. డ్రైనేజీ, మంచినీటి పైపుల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలి. నీటి నమూనాలను పరీక్షించి నివేదికను ప్రజలకు వెల్లడించాలి. కాలనీవాసులకు తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలి.



**సరిత (స్థానిక నివాసి):**

"గత వారం రోజులుగా ఇంటికి వస్తున్న నీటికి దుర్వాసన వస్తోంది. నీటి రంగు కూడా మారిపోయింది. చిన్న పిల్లలు ఉన్నందున తాగడానికి భయపడుతున్నాం. బయట నుంచి తాగునీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది."

**బాగ్యలక్ష్మి (గృహిణి):**

"మంచినీటితో వంట చేయాలన్నా భయంగా ఉంది. అధికారులు వచ్చి సమస్యను పరిశీలిస్తామని చెబుతున్నారు కానీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదు."

## దాడి చేసిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు

సంగారెడ్డి బ్యూరో, మే: 29(విజన్ ఆంధ్ర ) :మనూర్ మండల పరిధిలోని అతిమ్యాల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మహేశ్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత జర్నలిస్టు ఫోరం (డీజేఎఫ్) నాయకులు సంగారెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మార్చి 17న వార్త సేకరణకు వెళ్లిన రిపోర్టర్ రాములుపై సదరు ఉపాధ్యాయుడు దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో ఉపాధ్యాయుడికి సహకరించిన కొందరు గ్రామస్థులపైనా చర్యలు తీసుకోవాలని



విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్‌కు ఉమ్మడి మెదక్ జిల్లా దళిత జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు రాపాక విజయరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిజాలను నిర్భయంగా వ్రాసే జర్నలిస్టులపై దాడులు చేయడంపై తీవ్రంగా ఖండిస్తున్నాము అని అన్నారు. జర్నలిస్టులపై వరుస దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దత్తు రెడ్డి, జర్నలిస్టు సాయిలు, దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు తలారి యాదగిరి, పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ పోరు కేక- బహిరంగ సభను జయప్రదం చేయండి

- ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక పిలుపు
- చర్ల మండలంలోని పలు గూడేల్లో విస్తృత ప్రచారం
- ఎస్ టి జాబితా నుండి లంబాడీలను తొలగించాలని డిమాండ్

చర్ల, మే 29 (విజన్ ఆంధ్ర): వచ్చే జూన్ 3వ తేదీన పాకాల కొత్తగూడెంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్స్ (గుంజేడు ముసలమ్మ ప్రాంగణం) లో నిర్వహించనున్న ఆదివాసీ పోరు కేక బహిరంగ సభను ఆదివాసీలంతా కదిలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజుదొర, తుడుందెబ్బ చర్ల మండలం అధ్యక్షులు శ్యామల తరుణ్ పిలుపునిచ్చారు,శుక్రవారం చర్ల మండల పరిధిలోని దేవానగరం, దోసిల్లపల్లి,



ఉయ్యాలమడుగు, తిప్పపురం, పెద్దమిడిసిలేరు, చిన్నమిడిసిలేరు, కలివేరు తదితర ఆదివాసీ గ్రామాల్లో మరియు గూడెంల్లో నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఈ సభలో భాగస్వాములు కావాలని కోరారు

**ఆదివాసీల ఆవేదన - ప్రధాన డిమాండ్లు**

చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుండి వెంటనే తొలగించాలని లంబాడీల వల్లే స్థానిక ఆదివాసీ పిల్లలకు చదువుల్లో సీట్లు, ఉద్యోగాలు దక్కకుండా పోతున్నాయని, వారి భవిష్యత్తు అంధకారమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు, ఆదివాసీల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ఐటీడీఏ లు నేడు ఎడ్ల కొట్టాల్లా మారాయని, ఐటీడీఏల ద్వారా గిరిజనులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని మండిపడ్డారు,ఐదో షెడ్యూల్ ఉన్నప్పటికీ ఆదివాసీలకు ఏజెన్సీ సర్టిఫికేట్లు, ఏజెన్సీ ఉద్యోగాలు లభించడం లేదని గిరిజన గ్రామాల్లో 'పీసా' (పి ఈ ఐస్ ఎ) కమిటీలను అమలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆదివాసులు ధ్వజమెత్తరు,

ఆదివాసీ ఉద్యోగులకు సరైన ప్రమోషన్లు లేక భవిష్యత్తుకు భద్రత కరువైంది, అదివాసీల పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదని ఉన్న పట్టాలకు సరైన రక్షణ లేదని వాటికి గిరి వికాస్ బోర్లు కానీ, ఎలాంటి ప్రత్యేక రాయితీలు కానీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**ఇప్ప పువ్వుల దండులా తరలిరండి**

ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ప్రతి గూడెం నుండి ప్రజలంతా 'ఇప్ప పువ్వుల దండులా' కదిలివచ్చి, పాకాల కొత్తగూడెం బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు,ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సోడి అనిల్ కుమార్, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్ రావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలం శ్రీను, పాయం శ్రీదేవి, తుర్రం శాంత, శ్యామల నీలవేణి, కారం అదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.